ప్రజాశక్తి

గురువారం 23 మే 2024 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

ఈవీఎంల ధ్వంసంలో వైఫల్యం ఎవరిది?

- పిన్నెల్లి రామకృష్ణారెడ్డిపై కేసు నమోదులో తీవ్ర జాప్యం
- మాచర్ల ఎమ్మెల్యే అరెస్టుపై ప్రతిష్టంభన
- విదేశాలకు పారిపోకుండా లుక్ అవుట్ నోటీసు జారీ

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గం రెంటచింతల మండలం పాల్వాయిగేటు వద్ద పోలింగ్ కేంద్రంలో ఈవీఎం ధ్వంసం వ్యవహారంపై వాస్తవ పరిస్థితులకు భిన్నంగా అధికారులు ఎన్నికల కమిషన్‌కు నివేదిక ఇచ్చినట్టు తెలిసింది. ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి స్వయంగా పోలింగ్ కేంద్రంలోకి వచ్చి ఈవీఎంను, వివిప్యాట్‌ను ధ్వంసం చేసినా పోలింగ్ అధికారులు ఫిర్యాదు నమోదు చేయలేదు. గుర్తు తెలియని వ్యక్తులని మాత్రమే రాశారని, ఎన్నికల అధికారులు కూడా నివేదికను యథాతథంగా ఈసీకి పంపారని తెలిసింది. ఈనెల 15న పోలీసులకు పోలింగ్ అధికారులు ఫిర్యాదు చేశారు. అయితే ఇటీవల సిట్ అధికారుల దర్యాప్తు తరువాత వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా ఈనెల 20న రెంటచింతల పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. కేసులో పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని ప్రధాన నిందితునిగా

పాల్వాయి గేటు పోలింగ్ కేంద్రంలో ఈవీఎంను నేలకేసి కొడుతున్న మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

పేర్కొన్నారు. పల్నాడు జిల్లాలో మొత్తం ఏడు చోట్ల ఈవీఎంలను ధ్వంసం చేసినట్టు అధికారులు రికార్డులు నమోదు చేశారు. మిగతాచోట్ల నిందితులను అరెస్టు

▶ 2లో

ఎన్నికల నేపథ్యంలో 57 కేసులు నమోదు

పల్నాడు జిల్లా జెసి, మాచర్ల ఆర్‌ఓ శ్యాంప్రసాద్

8 లో

స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించిన కలెక్టర్

గుర్తింపుకార్డు ఉంటేనే అనుమతి : కమిషనర్

8 లో

కౌలు రైతులకు కార్డులు అందేదెప్పుడో?

- ఇప్పటికే కౌలు ఒప్పందాలు పూర్తి
- ప్రారంభం కాని జారీ ప్రక్రియ

6 లో

గోవిందపురం మేజర్ కాల్వను పరిశీలిస్తున్న కౌలురైతు సంఘం నాయకులు

అడవుల్లా పంట కాల్వలు!

- చెట్లు, గడ్డి, పిచ్చి మొక్కలతోపాటు మట్టిమేటలు
- ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచని వైనం
- బాగు చేయకుంటే సాగునీరు కష్టమే
- కాల్వలను పరిశీలించిన కౌలురైతు సంఘం
- కౌల్దార్లకు గుర్తింపు కార్డులు, రుణాలు, విత్తనాల కోసం డిమాండ్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నాగార్జున సాగర్ కుడికాల్వలు తమ స్వరూపాన్ని కోల్పోయి అడవులను తలపిస్తున్నాయని, చెట్లు, చేమ, గడ్డితో పెరిగి నీటి పారుదలకు అవకాశమే లేకుండా పోయిందని కౌలురైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు ఆవేదన వెలిబుచ్చారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట సమీపంలోని గోవిందపురం, అన్నవరం మేజర్ కాల్వలను కౌలురైతు సంఘం నాయకులు బుధవారం పరిశీలించారు. అనంతరం కోటప్పకొండ రోడ్డులోని సిపిఎం కార్యాలయంలో సమావేశమయ్యారు. సమావేశానికి సంఘం జిల్లా అధ్యక్షులు కె.రామారావు అధ్యక్షత వహించారు. హరిబాబు మాట్లాడుతూ పంట కాల్వలను, కట్టలను చూస్తుంటే నల్లమల అడవులను తలపిస్తున్నాయన్నారు. కాల్వలు, కట్టలు పూర్తిగా దెబ్బతినక ముందే ప్రభుత్వం, అధికారులు స్పందించి మేజర్ కాల్వలకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ మాట్లాడుతూ ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించి ఎరువులు విత్తనాలు సిద్ధం చేస్తున్నట్లు వ్యవసాయాధికార్లు చెబుతున్నా సాగుకు ప్రధానమైన నీటి సరఫరాను

▶ 2లో

ఛలో మాచర్ల అనుమతి లేదు : పల్నాడు ఎస్‌పి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

మాచర్లలో ఇటీవల జరిగిన ఘర్షణలలో వైసిపి నేతల బాధితులను పరామర్శించేందుకు టిడిపి నాయకులు గురువారం పల్నాడుకు వస్తుండటంపై ఎస్‌పి మల్లికా గర్గ్ స్పందించారు. ఇతరులకు ఎవ్వరూ మాచర్లకు రావద్దని ఎవరికి అనుమతి లేదని బుధవారంరాత్రి ఒక ప్రకటనలో ఆమె తెలిపారు.రాష్ట్ర నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, ఎవ్వరూ పల్నాడుకు రావద్దని ఆమె కోరారు.ర్యాలీలు, సభలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పోలింగ్ సిబ్బంది సస్పెన్షన్‌కు రంగం సిద్ధం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రెంటచింతల మండలం పాల్వాయ్ గేటు పోలింగ్ కేంద్రం సిబ్బందిని సస్పెండ్ చేయడానికి రంగం సిద్ధం అయినట్టు తెలిసింది. స్టేషన్ పిఓ సహా ఇతర సిబ్బందిని సస్పెండ్ చేశారు.పోలింగ్ రోజున గత సోమవారం పిన్నెల్లి రామకష్ణారెడ్డి పోలింగ్ కేంద్రంలోకి అడుగు పెట్టిన సమయం లో అక్కడ ఉన్న పివో, ఇతర సిబ్బంది లేచి నిలబడి అభివాదం చేసారు. సంఘటన సమయంలో అడ్డుకోలేదనే అభియోగాలపై సస్పెండ్ చేసి ఈ అభియోగాలపై సంజాయిషీ ఇవ్వాలని కోరారు. ఇప్పటి వరకు పివో తగిన సంజాయషీ ఇవ్వకపోవడంతో సస్పెండ్ చేస్తారనే ప్రచారం జరుగుతోంది.

స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాలతో పోలీసులు

11 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

ప్రజాశక్తి-ఈపూరు

మండలంలోని ఇనిమెళ్ళలో పోలీసులు బుధవారం విస్తృత తనిఖీలు చేపట్టారు. మండలంలో సమస్యాత్మక గ్రామం ఇనిమెల్లలో నియోజకవర్గం లోని ఐదు మండలాల పోలీసులు గ్రామాన్ని జల్లెడ పట్టారు. ఎన్నికల ఫలితాలు అనంతరం గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా గ్రామంలో తనిఖీలు చేసినట్లు ఎస్సై షేక్ మహమ్మద్ ఫిరోజ్ తెలిపారు. ఎటువంటి పత్రాలు లేని 11 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసు కున్నట్లు ఎస్సై తెలిపారు.

లింబ్ సాల్వేజ్ సర్జరీ విజయవంతం

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ

కుడి ముంజేయి పునరావృత సైనోవియల్ సార్కోమాతో బాధపడుతున్న మహిళలకు నగరంలోని అమెరికన్ ఆంకాలజీ ఇనిస్టిట్యూట్ (ఏఓఐ)లో లింబ్ సాల్వేజ్ సర్జరీని విజయవంతంగా సర్జరీ నిర్వహించినట్లు సర్జికల్ ఆంకాలజిస్టు డాక్టర్ ఇషాంత్ అయినపూరి తెలిపారు. హాస్పటల్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో వివరాలను తెలియచేశారు. కీళ్ల చుట్టూ ఉన్న కణజాలన్ని ప్రభావితం చేసే అరుదైన క్యాన్సర్ రూపం సైనోవియల్ సార్కోమా అన్నారు. ఇది సాధారణంగా తుంటి, మోకీలు, చీలమండ లేదా భుజంలో కనిపిస్తుందన్నారు.

అమెరికన్ ఆంకాలజీ ఇనిస్టిట్యూట్ (ఏఓఐ) వద్ద రోగి ప్రయాణం రెండు కీమోథెరపీ చికిత్సలతో ప్రారంభించినట్లు తెలిపారు. ఆతరువాత సంక్లిష్ట శస్త్ర చికిత్సను విజయవంతంగా చేసినట్లు తెలిపారు. అనేక సవాళ్లు ఉన్నప్పటికీ శస్త్ర చికిత్స బృందం ముంజేయిలో ముఖ్యమైన నరాలను కాపాడుతూ అన్ని ప్రభావిత భాగాలను విజయవంతంగా తొలగించారన్నారు. వాస్కులర్ పునర్నిర్మాణం, నరాల పునర్నిర్మాణం జరిగిందన్నారు. ప్రస్తుతం పూర్తి ఆరోగ్యంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అమెరికన్ ఆంకాలజీ ఇనిస్టిట్యూట్ చీఫ్ రీజనల్ ఆపరేటింగ్ ఆఫీసర్ మహేంద్ర రెడ్డి పలువురు వైద్యులు పాల్గొన్నారు.

ఐటిఐతో మెండుగా ఉద్యోగావకాశాలు

- ఉపాధి కల్పన అధికారి దేవరపల్లి విక్టర్‌బాబు

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : ఐటీఐ ఉత్తీర్ణత సాధించిన వారికి ఉద్యోగావకాశాలు మెండుగా ఉన్నా యని జిల్లా ఉపాధి కల్పన అధికారి దేవరపల్లి విక్టర్ బాబు తెలిపారు.బుధవారం మచిలీ పట్నం లో కష్ణా జిల్లా ఒకేషనల్ గైడెన్స్ కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా విక్టర్ బాబు మాట్లాడుతూ డిగ్రీలు చదవాల్సిన అవసరం లేదని పెద్ద పట్టాలు పుచ్చుకోవాల్సిన పనిలేదని, చదువులకు వేలకు వేలు ఖర్చు చేయాల్సిన అవసరం లేకుండా విద్యార్థులు పదో తరగతి తర్వాత ఐటిఐ కోర్సు పూర్తి చేస్తే వారి నైపుణ్యాన్ని బట్టి ప్రభుత్వ - ప్రయివేట్ రంగాల్లో అనేక ఉద్యోగాలు సులభంగా పొందవచ్చు అన్నారు. ఐటిఐ కళాశాల ప్రిన్సిపాల్ జి. గౌరిమణి మాట్లాడుతూ ఐటిఐ తో ఉజ్వల భవిష్యత్తు ఉంటుంది అని ఐటిఐ అడ్మిషన్ల జూన్ 10 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ త్వరితగతిన దరఖాస్తు ప్రక్రియ పూర్తి చేసుకుని అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా నైపుణ్యాభివద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావు, జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ అర్.వెంకట్రావ్, ఎల్ఐసి సీనియర్ డివిజనల్ మేనేజర్ డా.సుధాకర్ బాబు.జి, విద్యాశాఖ అధికారి ఐ.పద్మ రాణి,ఒకేషనల్ గైడెన్స్ వై.సత్య బ్రహ్మం,ఒకేషనల్ అధికారి సల్మాన్ రాజ్,ప్రవేట్ ఐటిఐ మేనేజ్మెంట్ ప్రతినిధి కోటేశ్వరరావు,కష్ణవేణి ఐటిఐ కళాశాల అధినేత కె.రమేష్, ఉపాధి కల్పన శాఖ సిబ్బంది జయరాజ్. జి.వెంకటేశ్వం రావు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న దేవరపల్లి విక్టర్‌బాబు

బిఎఎస్ఎఫ్ రూపొందించిన

ఎఫికాన్ ఆవిష్కరణ

విజయవాడ : స్థానిక విజయవాడ హోటల్ ఫ్రైడ్ మాధవ్‌లో వ్యవసాయ ఉత్పత్తులలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన జర్మనీకి చెందిన ప్రముఖ పురుగుమందుల కంపెనీ బిఎఎస్ఎఫ్ రూపొందించబడిన 'ఎఫికాన్'ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జింగ్ క్వింగ్ బి-వైస్ ప్రెసిడెంట్ మార్కెటింగ్ ఆసియా ఫసిఫిక్, గిరిధర్ రానువా బిజినెస్ డైరెక్టర్ బిఎఎస్ఎఫ్ ఇండియా లిమిటెడ్ శశి కిరణ్ లింగం-రీజనల్ పోర్టుఫోలియో మేనేజర్ ఇన్‌సెక్టిసైడ్స్, ఆసియా ఫసిఫిక్, ప్రశాంత్ జోషి-హెడ్ మార్కెట్ మేనేజ్‌మెంట్ నీలేష్ రావుల్, పోర్ట్‌ఫోలియో మేనేజర్ రమేష్ బాబు, బిజినెస్ యూనిట్ లీడ్ భార్గవ్ రెడ్డి, మార్కెటింగ్ మేనేజర్ శ్రీనివాస్ నూతి, రాకేష్ కుమార్, బిజినెస్ క్లస్టర్ లీడ్స్ రమేష్, రీజనల్ మేనేజర్ నన్ హేమ్స్, మనోజ్ కుమార్ నూనె, వినయ్ ప్రభాత్ గ్యారంపెల్లి-టెరిటరీ మేనేజర్స్, సాయి దుర్గ ఆగ్రో ఏజెన్సీస్-డిస్ట్రిబ్యూటర్ మాలంపాటి రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన బిజినెస్ డైరెక్టర్-గిరిధర్ రానువా మాట్లాడుతూ అందరి ఆదరాభిమానాలతో వ్యాపారం ఎంతో అభివృద్ధి గడించిందని చెప్పడం గర్వకారణంగా ఉందన్నారు. మార్కెటింగ్ మేనేజర్-భార్గవ్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత నూతన కీటకనాశణి శ్రేణిలో ఎఫికాన్ ఒక అద్భుతమైన కీటకనాశణి అని తెలిపారు. ప్రపంచ సస్య రక్షణ పరిశోధనలో ఎఫికాన్ ఒక నూతన శకాన్ని ప్రారంభిస్తుందని తెలిపారు. బిజినెస్ యూనిట్ లీడ్-రమేష్ బాబు మాట్లాడుతూ మా కంపెనీ ప్రతి సంవత్సరం రీసెర్స్, డెవలప్మెంట్ కొరకు రూ. 8వేల కోట్లు ఖర్చుచేస్తున్నామని తెలిపారు. హెడ్ మార్కెట్ మేనేజ్మెంట్-ప్రశాంత్ జోషి మాట్లాడుతూ మా సంస్థ ఈ రోజు విడుదల చేసిన 'ఎఫికాన్' కీటక నాశిని ప్రత్తి, మిరప, వంగ, టమాటో, కీరదోస పంటలను ఆశించు తెల్లదోమ, పచ్చదోమ, పేనుబంక సమస్యల నుంచి పంటను దీర్ఘకాలం రక్షిస్తూ అధిక దిగుబడి సాధించడానికి దోహదపడుతుంది. ఎఫికాన్ పురుగు మందు ఐఆర్ఎసి 36 అనే ప్రత్యేక గ్రూపునకు సంబంధించిన మందు, ప్రస్తుతం మార్కెట్లో లభిస్తున్న ఉత్పాదనలన్నింటి కంటే భిన్నమైన చర్యతో కీటకాల నుండి పంటను దీర్ఘకాలం సమర్ధవంతంగా రక్షిస్తుంది. ఈ కార్యక్రమంలో డీలర్లు, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజైన కారు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు ఇన్నర్‌రింగ్ రోడ్డులో బుధవారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. స్థానికుల వివరాలు ప్రకారం.. ఇన్నర్ రింగ్ రోడ్ నుంచి జేకేసీ రోడికి వెళ్లే మార్గంలో కారు డివైడర్ని ఢీ కొట్టింది. ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పించే క్రమంలో ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో కారు నుజ్జునుజ్జయింది. కారులోని ఇద్దరు వ్యక్తులకు గాయాలవడంతో ఆసుపత్రికి తరలించారు. ఘటనకు గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నూతన విద్యా సంవత్సరంలో

బైజూస్ తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్

అతిపెద్ద లెర్నింగ్ సెంటర్లలో అగ్రగామిగా ఉన్న బైజూస్ విద్యార్థుల కోసం కొత్త బ్యాచ్‌లను ప్రారంభించినట్లు సంస్థ రీజనల్ హెడ్ ఎం.ఎస్.కె.ఈశ్వర్ తెలిపారు. నగరంలోని బైజూస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2024 -25 అకడమిక్ విద్యా సంవత్సరంలో ప్రవేశానికి సంబంధించి నూతన బ్యాచ్‌ను ప్రారంభించారని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థుల కోసం తరగతి గది ఆధారిత ప్రోగ్రామ్‌లను అందిస్తున్నామని, బైజూస్ డిజిటల్ లెర్నింగ్ యూనివర్స్‌కు యాక్సెస్‌తో అనుబంధం ఉందని అందుకే వినూత్న కార్యక్రమాలను విద్యార్థుల కోసం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాఠ్యాంశాలు, బోధనాశాస్త్రంలో అత్యున్నత ప్రమాణాలతో అందిస్తున్నామని తెలిపారు.

ఈవీఎంల ధ్వంసంలో వైఫల్యం ఎవరిది?

(మొదటి పేజీ తరువాయి)

చేయడం, వారిపై కేసులు నమోదు చేయడంలో చురుకైనపాత్ర పోషించిన అధికారులు ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిపై కేసు నమోదులో వత్తిళ్లకు తలొగ్గి జాప్యం చేశారని తెలిసింది. సిట్ అధికారులు విచారణ తర్వాత కేసు నమోదు చేసిన రెంటచింతల పోలీసులు 10 సెక్షన్ల కింద పిన్నెల్లిని ప్రధాన నిందితుడుగా పేర్కొన్నారు.

సమస్యాత్మక నియోజకవర్గాల్లో పూర్తిస్తాయిలో వెబ్ కాస్టింగ్ ద్వారా ఎన్నికల ప్రక్రియను పరిశీలిస్తున్నట్టు చెప్పిన అధికారులు పిన్నెల్లిపై కేసు నమోదు చేయడానికి ఎందుకు కాలయాపన చేశారనే అంశం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఈవీఎం ధ్వంసం చేయడం అంటే స్వేచ్ఛాయుత ఎన్నికల నిర్వహణలో వైఫల్యంగా రాష్ట్ర ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా వ్యాఖ్యానించడం ద్వారా త్వరలో బాధ్యులైన అధికారులపై చర్యలు తప్పవని తెలుస్తోంది. పోలింగ్ కేంద్రంలో గొడవ జరగడం, ఈవీఎం ధ్వంసం, పోలింగ్ అధికారులు ఎమ్మెల్యే పిన్నెల్లి రాగానే లేచినిలబడి నమస్కారం చేయడం నిబంధనలకు విరుద్ధంగా జరిగినా జిల్లా అధికారులు కూడా వీటిపై తక్షణ చర్యలు తీసుకోలేకపోయారు. ధ్వంసమైన ఈవీఎం స్థానంలో మరొక ఈవీఎం అమర్చే సందర్భంలో అయినా రిటర్నింగ్ అధికారి సిసి పుటేజిలను, వెబ్‌కాస్ట్ వీడియోను పరిశీలించి తక్షణం కేసులు నమోదు చేయాల్సి ఉన్నా ఆయనా వత్తిళ్లకు తలొగ్గి ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకోలేదని చెబుతున్నారు.

ఈవీఎంల ధ్వంసం తరువాత పిన్నెల్లిని హౌస్ అరెస్టు చేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశించిన తరువాత అయినా జరిగిన ఘటనలకు సంబంధించి పూర్తిస్థాయి నివేదికను పంపడంలో ఎందుకు జాప్యమైంది. ఎవరి వత్తిడితో పల్నాడు జిల్లా అధికారులు చర్యలు తీసుకోవడంలో మిన్నకుండిపోయారనే అంశం చర్చనీయాంశంగా మారింది. మరోవైపు ఈవీఎంల ధ్వంసం కేసులో మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అరెస్టుపై ప్రతిష్టంభన కొనసాగుతోంది. ఆయన తెలంగాణలో ఉన్నారని తెలిసి పల్నాడు నుంచి పోలీసు అధికారులు వెళ్లారు. మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో గాలిస్తున్నారు. పల్నాడు ఎస్‌పి మలికాగర్గ్ అధ్వర్యంలో నాలుగు పోలీసు బృందాలు గాలిస్తున్నాయని ఎన్నికల కమిషన్‌కు సమర్పించిన నివేదికలో డిజిపి పేర్కొన్నారు. పిన్నెల్లి రామకృష్ణారెడ్డి విదేశాలకు పారిపోకుండా లుక్ అవుట్ నోటీసులు జారీ చేశారు.

అడవుల్లా పంట కాల్వలు!

(మొదటి పేజీ తరువాయి)

మాత్రం విస్మరిస్తున్నారని విమర్శించారు. ప్రధాన పంట కాల్వలకు ఎన్ఎస్‌పి అధికారులు కొన్నేళుగా పూడిక తీత పనులు చేయించలేదని, ఉపాధి హామీ కింద మైనర్ కాల్వల పనులే చేస్తున్నారని చెప్పారు. కాల్వ నిండా గడ్డి, మొక్కలు, చెత్తాచెదారంతో నిండాయని, ఆయకట్టు పొలాలకు నీరు సకాలంలో, సక్రమంగా అందే అవకాశం లేదని చెప్పారు. ఇదే కొనసాగితే రైతులు తీవ్రంగా నష్టపోతారని అన్నారు. అనంతరం పలు అంశాలపై తీర్మానాలను సమావేశం ఆమోదించింది. పంట కాల్వలకు మరమ్మతులు చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని, కౌలురైతులకు గుర్తింపు కార్డులు, రాయితీపై రుణాలు, విత్తనాలు, ఎరువులు సరఫరా చేయాలని, రైతు భరోసాను వారికే వర్తింపజేయాలని, సాగులో నష్టపోయి ఆత్మహత్యలు చేసుకున్న కౌలురైతు కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ తీర్మానాలను ఆమోదించారు. కార్యక్రమంలో నాయకులు టి.హనుమంతరావు, జి.పిచ్చారావు, కె.ఆంజనేయులు, హనుమంతరావు, ఎస్.లూథర్, ఐ.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
గుంటూరు, పల్నాడు
3
గురువారం 23 మే 2024

మతి స్థిమితంలేని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

మతి స్థిమితం లేని వ్యక్తి మృతి చెందిన సంఘటన ప్రత్తిపాడు మండల పరిధిలోని ఈదుల పాలెంలో చోటుచేసుకుంది.స్థానిక ఎస్ఐ వి.సోమేశ్వరరావు తెలిపిన వివరల ప్రకారం ఈదులపాలెం పరిధిలోని ఎన్ హెచ్ 16 హైవే పక్కన గల సెల్యూట్ వాటర్ హౌస్ ప్రైవేట్ లిమిటెడ్ పక్కన ఖాళీ ప్రదేశంలో సుమారు 40 సంవత్సరాల వయస్సు గల గుర్తు తెలియని మృతదేహం పడి ఉన్నట్లు చెప్పారు. గత కొన్నేళ్లుగా మతి స్థిమితం లేకుండా ఉన్న అతను హైవే ప్రక్కన గల సెల్యూట్ వాటర్ హౌస్ ప్రైవేట్ లిమిటెడ్, కాటూరి హాస్పిటల్ చుట్టుప్రక్కల పరిసరాలలో భిక్షాటన చేసేవాడని, అక్కడే చెట్ల కింద నిద్రించే వాడని చెప్పారు. కొన్ని రోజుల నుండి ఎటు తిరగకుండా అక్కడే ఓ చెట్టు కింద పడుకొని ఉన్నాడని, చుట్టుపక్కల వారు చూసి తమకు ఈ మేరకు సమాచారం ఇచ్చినట్లు ఎస్ఐ తెలిపారు. ఈదులపాలెం విఆర్ఓ జె. ఆదినారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

త్రికోటేశ్వరునికి మల్లెపూలతో అర్చన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

కోటప్పకొండ మేధా దక్షిణామూర్తి స్వరూప త్రికోటేశ్వర స్వామికి మల్లెపూల అర్చన కార్యక్రమం బుధవారం ప్రదోష కాలంలో నిర్వహించారు. ఈ కార్యక్రమం ప్రతి వైశాఖ శుద్ధ పౌర్ణమి రోజున ఈ కార్యక్రమం నిర్వహిస్తుంటామని ఆలయ కార్య నిర్వ హణాధికారి శ్రీనివాసరెడ్డి, ఆలయ ప్రధాన ఉప అర్చ కులు కిరణ్ కిషోర్ శర్మ తెలిపారు. వంశ పారంపర్య ధర్మకర్త నరసరావుపేట జమిం దార్ రామకృష్ణ బహు దూర్ కుటుంబసభ్యులు, ఆలయ అధికారులు మల్లికార్జునరావుతో పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

ప్రజాశక్తి-అచ్చంపేట

వెంకటేశ్వర్లు

దైవదర్శనానికి వెళుతూ రోడ్డు ప్రమాదంలో అచ్చంపేట మండలం కోనూరునికి చెందిన వద్ధుడు.నడికుదురు చిన్న వెంకటేశ్వర్లు(70) మృతి చెందిన సంఘటన తాడువాయి సమీ పంలో బొగ్గు వాగు దగ్గర బుధ వారం మధ్యాహ్నం చోటు చేసుకుంది మతుని బంధువులు తెలిపిన వివరాల ప్రకారం కోనూరు గ్రామానికి చెందిన 12 మంది తెలంగాణ రాష్ట్రంలోని మఠంపల్లి శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణానికి ఆటోలో బయలుదేరారు అచ్చంపేట మండలం పుట్లగూడెం, తడువాయి గ్రామాల మధ్య బొగ్గు వాగు మలుపు వద్ద ఆటో బోల్తా కొట్టింది ఈ క్రమంలో నడికుదురు వెంకటేశ్వర్లు మృతి చెందగా అతని భార్య చిన్న వీరమ్మ, నడికుదురు వెంకటేశ్వర్లు, నడికుదురు నాగరాజు, నాగేంద్రం, వీరా కుమారులకు స్వల్ప గాయాలయ్యాయి వీరందరిని108 అంబులెన్స్ లో సత్తెనపల్లి తరలిం చారు పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి తరలించారు.

పోలింగ్ రోజున దాడి చేసి గాయపరిచారు

- ఈ వీఎంలను పిన్నెల్లి ధ్వంసం చేస్తుంటే అడ్డుకున్నా
- డాక్టర్ దగ్గరకు రహస్యంగా వెళ్లా
- టిడిపి ఏజెంట్ నంబూరి శేషగిరిరావు

మాట్లాడుతున టిడిపి ఏజెంట్ నంబూరి శేషగిరిరావు, చిత్రంలో జూలకంటి బ్రహ్మారెడ్డి తదతరులు

ప్రజాశక్తి - రెంటచింతల

ఈ నెల 13న పోలింగ్ సందర్భంగా పాల్వాయి గేటు గ్రామం లోని 202 పోలింగ్ బూత్‌లో తమపై విచక్షణ రహితంగా దాడి చేసి గాయపరిచారని, డాక్టర్ వద్దకు వెళ్లి చికిత్స చేయించుకోవాలన్నా రహస్యంగా వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందని టిడిపి ఏజెంట్ నంబూరి శేషగిరిరావు బుధవారం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బ్రహ్మారెడ్డి తో కలిసి మీడియాతో మాట్లాడుతూ మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామ కృష్ణారెడ్డి ఈవీఎంలను ధ్వంసం చేస్తూ సమ యంలో అడ్డుకున్న తనను గాయ పరి చారని తెలిపారు. ఇదిలా ఉండగా శేషగిరిరావును అమెరికా పర్యటనలో ఉన్న చంద్రబాబు ఫోన్ ద్వారా పరా మర్శిం చారు. ఆరోగ్య పరిస్థితిపై ఆరాతీసి పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు.

తాగునీరు రాదు.. బోర్లు పని చేయవు

చిలకలూరిపేటలోని ఊచి చివర కాలనీలు, స్లమ్ ఏరియా వాసులకు తీరని తాగునీటి కష్టాలు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

రెండు మూడు రోజులకొక పర్యాయం స్థానాలు చేస్తున్నామని చిలకలూరిపేట ఊరి చివర మదర్ థెరిస్సా కాలనీ, కృష్ణారెడ్డి కాలనీ వాసులు రాజీవ్ స్వగృహ అపార్టుమెంట్ వాసులు వాపోతున్నారు. ఊరు చివర కాలనీలలో అద్దెలు తక్కువ అని నివాసముంటున్న వారికి, రోడ్ల పక్కన నివాసముండే వారికి, మురికి వాడ వాసులకు తాగునీటి కష్టాలు తీవ్ర మయ్యాయి. రోజు విడిచి రోజు జరిగే తాగునీటి సరఫరా కొంచెం సేపు ఉంటోంది. ఆ కొంచెం సమయంలో కూడా తాగునీటికి బదులు మురుగు నీరు వస్తుండటంతో ఊర్లోనూ, ఊరు చుట్టు పక్కల కాలనీల వాసులు, మురికివాడ వాసులు, ముఖ్యంగా ఊరి చివర అపార్టు మెంట్‌లో అద్దెల కుండే ప్రజలు మినరల్ వాటర్‌ను తెచ్చుకునే పరిస్థితి.

చిలకలూరిపేట పట్టణంలో బోరిం గ్ పంపులు సుమారుగా 130 దాకా ఉన్నాయి. వాటిల్లో 20,30 మాత్రమే పని చేస్తున్నాయి. ఈ ఊరు చివరాసనం ఏరి యాలో సుమారుగా 50 60 బోరింగులు ఉన్నాయి వాటిల్లో కనీసం 10 కూడా పని చేయడం లేదు. దీంతో కాలనీ అపార్ట్మెంట్ వాసులు ఇబ్బందులు గురవుతున్నారు. అపార్టుమెంట్‌లో అద్దెలకుంటున్న వారు మూడో అంతస్తులోకి నీరు తీసు కెళ్లడం చాలా కష్టమవుతోంది.

మున్సిపాలిటీ వారు ఇచ్చే తాగునీరు ఎప్పుడు వస్తాయో, ఎప్పుడు రావో తెలియని పరిస్థితి. ఇక ఎన్. టి.ఆర్ సుజల పథకాల కింద రెండు రూపా యలకే స్వచ్ఛమైన మంచినీరు ఇస్తున్న వీటిని గత మూడు నాలుగు సంవత్సరాల క్రితమే ఆపివేశారు. పట్టణ ప్రజలకు మంచి నీరు దొరక్క ప్రయివేటు వాటర్ ప్లంట్సపై ఆధార పడటంతో ప్లాంట్స్ వారిస్టాను సారం నీటి ధరలు పెంచా రంటున్నారు. ఇప్పటికైనా మున్సిపాలిటీ ఉన్నతా ధికారులు వెంటనే స్పందించి బోరింగులను బాగు చే యించాలని, ముఖ్యంగా ఊరు చివర ఉన్న కాలనీలో అపార్ట్మెంట్ వాసులకు ప్రాధాన్యత నివ్వాలని వారు అంటున్నారు.

అంతేకాకుండా ట్రాక్టర్లతో తాగునీటి సరఫరా చాలడం లేదని అంటున్నారు. ఇప్పటికైనా తాగునీటి సరఫరా సమ యాలు ముందుగానే కనీసం కాలనీ వాసులకు అయిన తెలియజేయాలని, నిబంధ నల ప్రకారం ఎన్టీఆర్ సుజల పథక ం తాగునీరు ఇచ్చే విధంగా చర్య లు తీసుకోవాలని, నీరు శుద్ధి చేసి మురుగు నీరు వాటిలో కాలువ కుం డా తగు జాగ్రత్తలు తీసుకుని వదలా లని, మినరల్ వాటర్ ప్లాంట్ లో వా రు ఇష్టానుసారంగా ధరలో పెంచ కుండా తగు నిబంధన విధిం చాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు.

ఊరి చివర కాలనీలైన కష్ణారెడ్డి డొంకలో ఉన్న రాజీవ్ స్వగహ అపార్ట్మెంట్లో మూడో అంతస్తులో ఉంటున్న.. ఆమె మాటల్లో అద్దెలు తక్కువగా ఉన్నాయని ఊరు చివర ఉన్న రాజీవ్ స్వగృహ అపార్టు మెంట్‌లో ఉంటున్నామన్నారు. తాగకనీటి తీవ్ర సమస్య అయిందన్నారు. ఈ అపార్ట్మెంట్లో సుమారుగా 12 ఇల్లు ఉన్నాయని వాటి మొత్తానికి సంపు ద్వారా ట్యాంకు నీళ్ల పడతామని తద్వారా వచ్చే నీరుని వాడుకుంటామన్నారు. అయితే మంచినీరు తీవ్ర ఎద్దడి వల్ల సంపనుకు నీరు సక్రమంగా చేరటం లే దన్నారు . దీంతో కింద నుంచి మూడోవ అం తస్తుకు కేవలం త్రాగడానికే మంచి నీరును మోసుకోవాల్సి వస్తుందంటు న్నారు. ఇహ ఉన్నబోర్లు పాడై నెలలు కావ స్తోం దం టున్నారు.

చిలకలూరిపేట ఊరి చివరలోని రాజీవ్ స్వగృహ అపార్టుమెంట్

నిన్న మొన్న టి వరకు ఎన్ఎస్పీ కెనాల్ లో బట్టలు ఉతకడం, స్థానాలు చేయటం చేసే వారమన్నారు. ఆ నీరు కూడా ఆగి పోయాయి అన్నారు. నీరు దొరకక రెండు మూడు రోజులకు ఒక పర్యా యం స్థానం చేయాల్సి వస్తుందని వాపోయారు. రోడ్ల పక్క వారు పనులు చేసుకుని తిరిగి వచ్చు నప్పుడి వారితో పాటు నీరు తెచ్చు కుంటా మంతున్నారు. ఇది కేవలం తాగటానికే నని , స్నానం ఇతర వాటికి నీరు లేక చాలా ఇబ్బందులు పడుతున్నామని రోడ్ల పక్క నివాసం ఉంటున్న వారు చెబుతున్నారు. ఈ విషయమై కమిషనర్ సి.హెచ్. గోవిందరావు స్పందిస్తూ బోరింగులు బాగు చేయిం చేందుకు నిధులు లేవన్నారు..

మూతపడ్డ ఎన్టీఆర్ సుజల పథకం

మాట్లాడుతున్న హైకోర్టు న్యాయవాది లక్ష్మీనారాయణ

ఈవీఎంలను ధ్వంసం చేసిన పిన్నెల్లిని పోటీకి అనర్హుడిగా ప్రకటించాలి

హైకోర్టు న్యాయవాది లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ రోజున గృహ నిర్బంధంలో ఉండాల్సిన మాచర్ల వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణా రెడ్డి, తన నియోజకవర్గంలోని 202 వ పోలింగ్ కేంద్రంలోకి వెళ్లి పోలింగ్ అధికారుల ముందే ఈవిఎం, వివి ప్యాట్ ధ్వంసం చేసిన ఆయనను కఠినంగా శిక్షించాలని హైకోర్టు న్యాయవాది ఓ.లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావు పేటలోని టిడిపి జిల్లా కార్యాలయంలో బుధ వారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో లక్ష్మీనారాయణ మాట్లా డుతూ పోలింగ్ కేంద్రంలోకి అక్రమంగా ప్రవే శించి ఎన్నికల సామగ్రిని, ఈవిఎం లను పగలగొట్టిన ఆయనను పోటీకి అన ర్హుడిగా ప్రకటించాలన్నారు. నరసరావుపేట, మాచర్ల, గురజాల నియోజకవర్గాల్లో అత్యంత సమస్యాత్మక గ్రామాలు ఉన్నాయని, అక్కడ పటిష్ట భద్రత చర్యలు తీసుకోవాలని గతంలో ఎలక్షన్ కమిషన్ సూచించినప్పటికీ పోలీసులు చర్యలు చేపట్ట లేదన్నారు. పల్నాడులో జరిగిన హింసాత్మక ఘటనల దృష్ట్యా కౌంటింగ్ రోజున కౌం టింగ్ కేంద్రం వద్ద భద్రత పటిష్టం చేయాలని డిమాండ్ చేస్తూ పరిశీలించేందుకు వెళుతున్న టిడిపి ఏజెంట్లను అనుమతించడం లేదన్నారు. ఆయా ఘటనలలో టిడిపి వర్గీయులపై కావాలనే తప్పుడు కేసులు పెడుతున్నా రన్నారు. దాడుల్లో పాల్గొన్న వైసిపి నేతలపై తూతుమంత్రంగా కేసులు పెట్టారని ఆరో పిం చారు. జిల్లాలో చోటు చేసుకున్న సంఘటనలపై పోలీ సులు నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో న్యాయవాది డి.ఉదయశ్రీ, జె.సుబ్బారావు పాల్గొన్నారు.

పాతగణేశునిపాడులో కార్డన్ సెర్చ్

ప్రజాశక్తి-పిడుగురాళ్ళ

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జరిగిన రాజకీయ ఘర్షణలు దృష్ట్యా మండలంలోని పాతగణేశునిపాడు గ్రామంలో బుధవారం పోలీస్ పట్టణ సిఐ వీరాంజి నేయులు ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వ హించారు. జరిగిన ఎన్నికల్లో గ్రామంలో ఇరు పార్టీలకు చెందిన వారు దాడులు చేసుకున్నారు.ఎన్నికల ఫలితాల తర్వాత ఎటువంటి ఘటనలు జరగకుండ ముందస్తు చర్యలలో భాగంగా గ్రామంలోని ఇళ్ళు,దుకాణాలు, గౌడౌన్లలో పోలీ సులు తనిఖీలు నిర్వహించారు.ఈ తనిఖీలలో గ్రామంలో పత్రాలు లేని సుమారు ద్విచక్ర వాహానాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలో ఎవరైన అవాంఛ నీయ ఘటనలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అలాగే, పెట్రోల్‌ను బాటిళ్ళలో అమ్మ కూడదని, ద్విచక్ర వాహనాలపై నెంబర్ కనిపించేలా కచ్చితంగా ఉండాలని మరే ఇతర స్టికర్లు ఉన్న వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. వాహన దారులు తమ వాహన ధృవీకరణ పత్రాలు తమ వెంట కలిగి ఉండాలని లేదా ఫోన్‌లో ఉన్న ఫర్వాలేదని చెప్పారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని ,ర్యాష్ డ్రైవింగ్ చేయడం, వాహనాల సైలన్సర్లు మార్చి పెద్ద శబ్దాలు వచ్చే సైలన్సర్లు పెట్టకూడదని తెలిపారు. నియమ నిబంధనలు ఉల్లం ఘించే వారిపై చర్యలు తప్పవని సిఐ హెచ్చరించారు.

ఓట్ల లెక్కింపునకు పకడ్బందీ చర్యలు

ప్రజాశక్తి - పెదకూరపాడు

సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు 4వ తేదీన జరగునున్న నేపథ్యంలోఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పకడ్బందీ చర్యలు తీసుకున్నట్లు పెదకూరపాడు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి శ్రీరాములు తెలిపారు. ఓట్ల లెక్కింపుపై రాజకీయ పార్టీలతో స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఆయన బుధవారం సమావేశమయ్యారు. నియోజకవర్గంలో 266 పోలింగ్ కేంద్రాలకుగాను 14 టేబుల్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 19 రౌండ్ల లెక్కింపు ఉంటుందన్నారు. పోస్టల్ బ్యాలెట్లు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో భద్రంగా ఉన్నాయన్నారు. 3న నరసరావుపేటకు తరలిస్తామని చెప్పారు. సర్వీస్ ఓట్లు జూన్ మూడవ తేదీ వరకు వేసే అవకాశం ఉన్న దృష్ట్యా పెదకూరపాడులోనే ఉంచడం ఉంచామని చెప్పారు. ప్రతిరోజు మధ్యాహ్నం 12 నుండి ఒంటిగంట వరకు సర్వీస్ ఓట్లు ఉంటే జత చేస్తామని, రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరవ్వొచ్చని చెప్పారు.

డాక్టర్ సరికొండ రమాదేవికి జ్ఞానబుద్ధ పూర్ణ జాతీయ గౌరవ అవార్డు

ప్రజాశక్తి-సత్తెనపల్లి

సత్తెనపల్లికి చెందిన డాక్టర్ సరికొండ రమాదేవి తెలుగు వెలుగు ఉగాది జ్ఞానబుద్ధ పూర్ణ జాతీయ గౌరవ అవార్డును ఇటీవల ఒంగోలులో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో అందుకున్నారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు పోలోజు రాజ్‌కుమార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు తెలుగు వెలుగు సాహితి వేత్త డాక్టర్ అక్కినపల్లి భాస్కర ఆచార్యులు, తెలుగు వెలుగు జాతీయ అధ్యక్షులు డాక్టర్ ఆర్.రమేష్, గిన్నీస్ వరల్డ్ రికార్డ్ గ్రహీత గౌరవ అధ్యక్షులు డాక్టర్ వి.శాంతి కృష్ణ ఆచార్యుల నుండి సాహిత్యం, సేవారంగాల్లో సేవలకుగాను అవార్డును ప్రదానం చేసి సత్కరించారు. ఆమెకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

పుట్టినరోజు సందర్భంగా భోజనం పంపిణీ

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

సురిశెట్టి సైదయ్య, రుషిక దంపతుల కుమారుడు గురునందన్ పుట్టినరోజు సందర్భంగా సత్తెనపల్లిలోని గీతా మందిరం వద్ద బుధవారం భోజనం పంపిణీ చేశారు. భరతమాత అన్నప్రసాద వితరణ పథకంలో నిరుపేదలు,

వృద్ధులు, యాచకులకు భోజనం ప్యాకెట్లను అందజేశారు. కార్యక్రమంలో అన్నప్రసాద వితరణ పథకం రూపశిల్పి, సీనియర్ న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు, కుంచనపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కార్మికోద్యమానికి అంకితమైన పర్స సత్యనారాయణ

వర్ధంతి సభలో సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్

ప్రజాశక్తి-సత్తెనపల్లి

కార్మికవర్గ ఉద్యమాలకే తన జీవితాన్ని అంకితాన్ని పర్స సత్యనారాయణ అంకితం చేశారని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్ కుమార్ అన్నారు. బుధవారం స్థానిక పుతుంబాక భవన్‌లో పర్స సత్యనారాయణ వర్ధంతి సభ సిపిఎం నాయకులు గుంటుపల్లి బాలకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. విజయ్ కుమార్ మాట్లాడుతూ సత్తెనపల్లి తాలూకాలో జన్మించిన పర్స సత్యనారాయణ తెనాలి, దుగ్గిరాల, హైదరాబాదులలో చదువు పూర్తి చేసుకొని సింగరేణి బొగ్గు గనుల్లో కార్మికునిగా చేరారని తెలిపారు. అక్కడ కార్మికుల స్థితిగతులను, కష్ట నష్టాలను అర్థం చేసుకుని కార్మిక సంఘాలను నిర్మించి కార్మికోద్యమాలను నడిపారని చెప్పారు. ఈ నేపథ్యంలోనే ఆయన కార్మిక సంఘం నాయకునిగా గుర్తింపు పొందారన్నారు. అయితే కార్మికుల ఉద్యమాలను నిర్వీర్యం చేయాలని ఉద్దేశంతో అక్కడి యాజమాన్యం ఆయనను విధుల నుండి బహిష్కరించిందని, ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొన్న పర్సా సత్యనారాయణ తన ఉద్యోగానికి రాజీనామా చేసి పూర్తి కార్మిక ఉద్యమానికే అంకితమయ్యారని తెలిపారు. ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని, ఆయన ఆశయాల సాధన కోసం పని చేయడమే ఆయనకు అర్పించే నివాళని అన్నారు. తొలుత పర్స సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిపిఎం రాష్ట్ర కమిటీ మాజీ సభ్యులు గద్దె చలమయ్య, పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎవిఎన్ గోపాలరావు, నాయకులు హనుమంత్‌రెడ్డి, శివకుమారి, జె.రాజకుమార్, పెద్దిరాజు, జి.రజిని, బి.రామచంద్రరావు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట పైర్లతో రెట్టింపు ప్రయోజనాలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

అధిక దిగుబడుల కోసం రసాయనిక ఎరువులు మోతాదుకు మించి వాడితే దిగుబడులు పెరగక పోగా భూమిలోని పోషకాలు దెబ్బతిని నేల నిస్సారమవుతుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. సేంద్రీయ ఎరువుల వాడకం మంచిదని, అయితే దాని లభ్యత తగ్గిన నేపథ్యంలో పచ్చిరొట్ట పైర్ల సాగు ఉత్తమమని చెబుతున్నారు. ప్రధాన పంటల సాగుకు ముందు జీలుగ, జనుము, పిలిపెసర పైర్లు సాగు చేపట్టాలని సూచిస్తున్నారు.

50 శాతం రాయితీపై విత్తనాలు

పచ్చిరొట్ట పైర్ల వల్ల నేలకు నీటిని, పోషకాలను నిలిపే సామర్థ్యం పెరుగుతుంది. ఈ పైరును పూతదశలో నెలలో కలియదున్నితే అవి భూమిలో కుళ్లి విడుదల చేసే ఆమ్లాల వల్ల నేలలో మొక్కలకు పొటాష్ అందడమే గాక గాల్లోని నత్రజని నేలలో స్థిరీకరణ అవుతుంది. ఆ సమయంలో ఎకరానికి 50 కిలోల సూపర్ ఫాస్పెట్ వేస్తే త్వరగా కుళ్లిపోతుంది. ప్రధాన పంటకు 50 కిలోల ఎరువును తగ్గించి వాడవచ్చు. పొలాల్లో నత్రజని తక్కువగా ఉంటే ఎకరానికి 8 కిలోల నత్రజని వేయడం వల్ల మొక్క ఏపుగా పెరుగుతుంది. జనుము ఎకరానికి 16 నుండి 24 కిలోలు, జీలుగ 12 నుండి 24 కిలోలు వాడితే తగు మోతాదులో నత్రజని, బాస్వరం, పొటాష్ లభిస్తుంది. భూసారం పెరిగి చౌడు భూములూ క్రమంగా సాధారణ స్థితికి వస్తాయి. ఈ విత్తనాలను 50 శాతం రాయితీపై ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా సరఫరా చేస్తోంది.

చౌడు నెలలూ సాధారణ స్థితికి

డాక్టర్ గురువుగారి రమేష్, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త.

రసాయన ఎరువులు వాడటం, తగినంతగా సేంద్రీయ ఎరువులు లేకపోవడంతో భూ సారం, నేల ఆరోగ్యం తగ్గి పైర్లకు తెగుళ్ల సోకుతున్నాయి. పచ్చిరొట్ట విత్తనాలను సాగు చేస్తే భూమి సారవంతమవుతుంది. చౌడు నేలలను సైతం సాధారణ స్థితికి తెచ్చి దిగుబడులను పెంచుకోవచ్చు.

ప్రతి మండలానికి 500 క్వింటాళ్లు : ఎడిఎ మస్తానమ్మ

చౌడు భూములు, వరి పండించే భూములకు అనుకూలం. తేలికపాటి, ఇసుక నేలల్లో సాగు చేయెచ్చు. వేరు బుడిపెలు ఎక్కువగా ఉండి, నత్రజని స్థిరీకరణ ఎక్కువ చేస్తుంది. ఎకరానికి 12-15 కిలోల విత్తనం అవసరం. దీన్ని కలియదున్నితే ఎకరానికి 8-10 టన్నుల పచ్చిరొట్ట లభిస్తుంది. టన్ను పచ్చిరొట్టలో 6 కిలోల వరకు నత్రజని, ఒకటి నుండి ఒకటిన్నర కిలోల భాస్వరం, పొటాష్ ఉంటాయి. ప్రతి మండలానికి 500 క్వింటాళ్ల చొప్పున విత్తనాలు అందుబాటులోకి వస్తాయి.

కంప్యూటర్ శిక్షణ వైపు నడిపిస్తున్న అవసరం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రస్తుత ఆధునిక యుగంలో కంప్యూటర్ లేనిదే ఎటువంటి రంగాన్ని ఊహించుకోలేము. చేతిలో ఎన్ని డిగ్రీలతో పాటు ఉన్నత విద్య పూర్తి చేసినా ఉద్యోగాలు కావాలంటే కంప్యూటర్ పరిజ్ఞానాన్ని అదనపు అర్హతగా పరిగణలోకి తీసుకునే పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ, ప్రైవేటు రంగాలతో పాటు చిన్న స్థాయి నుంచి పెద్ద స్థాయి ఉద్యోగాల వరకు కంప్యూటర్ పరిజ్ఞానాన్ని వీలు చిక్కినప్పుడల్లా కంప్యూటర్ కోర్సులలో శిక్షణ తీసుకుంటున్నారు. వేసవికాలం సెలవులు కావడంతో పాఠశాల నుంచి కళాశాల విద్యార్థులు, గృహిణులు సైతం కంప్యూటర్ శిక్షణకు వెళుతున్నారు. ప్రస్తుతం ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలలో కంప్యూటర్ లేనిదే పని జరగడం లేదంటే ఏ మాత్రం అతిశయోక్తి కాదు. ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలన్నా పోటీ పరీక్షలు రాయాలన్నా కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరైంది. సాంకేతిక పరిజ్ఞానం కోసం నరసరావుపేట పట్టణంలోని కోచింగ్ సెంటర్లకు మరికొంతమంది గుంటూరు విజయవాడ వంటి పట్టణాలకు వెళ్లి యువతీ, యువకులు, విద్యార్థులు కంప్యూటర్ శిక్షణ పొందుతున్నారు. డిగ్రీ, బీటెక్ విద్యార్థులు కూడా కంప్యూటర్ సెమిస్టర్‌లోని అంశాలను క్షుణ్ణంగా తెలుసుకునేందుకు కంప్యూటర్ ద్వారా సులభంగా ఉండడంతో ఆసక్తి చూపుతున్నారు. చిన్నచిన్న ఉద్యోగాలు చేసుకునే వారు సైతం ఉదయం సాయంత్రం వేళల్లో ఆయా కోచింగ్ సెంటర్లలో శిక్షణ పొందుతున్నారు. ఈ నేపథ్యంలో ఆసక్తి, అవసరం ఉన్నవారికి ఎంఎస్ ఆఫీస్, టాలీ, సి-లాంగ్వేజ్, పైథాన్, జావా, డిటిపి, ఫోటోషాప్, తెలుగు టైపింగ్, స్పోకెన్ ఇంగ్లీష్ వంటి కోర్సులు, మల్టీ స్టాఫ్వేర్, అకౌంటింగ్, వెబ్ డిజైనింగ్, నెట్ వర్కింగ్ తదితర కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు. కోర్సులను బట్టి రూ.వెయ్యి, రూ 3 వేల వరకు ఫీజులు నిర్ణయించారు.

ఉద్యోగం కోసం కంప్యూటర్

మార్కెట్లో ఏ చిన్న ఉద్యోగం కావాలన్నా కంప్యూ టర్ పరిజ్ఞానం అడుగుతు న్నారు. అందుకే కంప్యూటర్‌పై పట్టు సాధించడం మంచిదని నేర్చుకుంటున్నాను. భవిష్యత్‌లో ఉన్నత ఉద్యోగం సాధించాలన్నా కంప్యూటర్ పరిజ్ఞానం ఎంతో ఉపయోగపడుతుంది.

అస్మా సుల్తానా, ఇంటర్మీడియట్ విద్యార్థిని, రావిపాడు.

కంప్యూటర్ పరిజ్ఞానం ఇప్పుడు చాలా అవసరం

ప్రస్తుత కాలంలో కంప్యూటర్ పరిజ్ఞానం చాలా అవసరం. కంప్యూటర్‌తో పాటుగా, ఫొటోషాప్, ఇంటర్నెట్ గురించి శిక్షణ పొందుతున్నాను. ముఖ్యంగా ఇంటర్నెట్లో అనేక సైట్లను సందర్శించడం వల్ల జనరల్ నాలెడ్జ్ పెరిగింది. ఫొటోషాప్ నేర్చుకోవాలన్న ఉత్సాహం ఉండడంతో దానితో పాటు ఇతర కోర్సులలో శిక్షణ పొందుతున్నాను.

ప్రవీణ్, డిగ్రీ విద్యార్థి, నరసరావుపేట.

కంప్యూటర్‌తో ఉజ్వల భవిత

నేటి ఆధునిక పరిస్థితుల్లో కంప్యూటర్ విద్య ద్వారానే ఉజ్వల భవిష్యత్ ఉంటుంది. కంప్యూటర్ పరిజ్ఞానం లేనిదే ఉద్యోగాలు సాధించాలంటే కష్టం. వ్యాపారాల నిర్వహణకూ కంప్యూటర అవసరమవుతోంది. ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, పాఠశాల, కళాశాల విద్యార్థులు సైతం కంప్యూటర్‌లోని వివిధ విభాగాలను నేర్చుకుంటున్నారు. చిన్నారులను కంప్యూటర్ విద్యను బోధించే ఉన్నత విద్యాసంస్థల్లో చేర్పించటం మంచిది. చదువుతున్న పాఠశాలల్లో కంప్యూటర్ విద్యా సౌకర్యం లేకుంటే కోచింగ్ సెంటర్ల ద్వారా శిక్షణిప్పించడం మంచిది. విద్యార్థులను ప్రోత్సహించేందుకు వివిధ కోర్సుల్లో ఫీజు రాయితీలిస్తున్నాం.

పొట్లూరి మధుసూదనరావు, సాఫ్ట్‌టెక్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ సెంటర్, నరసరావుపేట.

సమస్యలపై పర్సా స్ఫూర్తితో పోరాటం

పర్సా సత్యన్నారాయణకు సిఐటియు నివాళి

పర్సా సత్యనారాయణ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-గుంటూరు :సిఐటియు వ్యవస్థాపకులు, సుదీర్ఘకాలం సిఐటియు ఉమ్మడి రాష్ట్ర అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహించిన పర్సా సత్యనారాయణ 9వ వర్ధంతి సందర్భంగా స్థానిక పాతగుంటూరులోని యూనియన్ జిల్లా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల నువేసి నివాళు లర్పించడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజీ మాట్లాడుతూ పేద కుటుంబంలో పుట్టి, పేదల కోసమే తన చివరి వరకూ పోరాడిన గొప్ప నాయకుడు వ్యక్తి అని అన్నారు. రాష్ట్రానికి తలమానికంగా ఉన్న విశాఖ ఉక్కు సాధన కోసం తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసిన ధన్యజీవి అని అన్నారు. సింగరేణి బొగ్గు గని కార్మికుల సంఘం నిర్మించడంలో ముఖ్య భూమిక పోషించారని తెలిపారు. తనకు వచ్చిన వేతనాన్ని కూడా సంఘానికే ఇచ్చేవాడని, కార్మిక ఉద్యమాలను మరింత విస్తృతంగా నిర్మించడమే ఆయనకు ఇచ్చే ఘనమైన నివాళి అని అన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు దండా లక్ష్మీనారాయణ, కోశాధికారి సాంబశివ రావు, బి.లక్ష్మణరావు, చింతల శ్రీను, ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు రాజారావు, జి రమణ పాల్గొన్నారు.

పర్సా చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-గుంటూరు :కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కషి చేయడమే పర్సా సత్యనారాయణకు అర్పించే నివాళి అని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజీ అన్నారు. సిఐటియు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే పర్సా సత్యనారాయణ వర్ధంతి కార్యక్రమం స్థానిక బ్రాడీపేటలోని సిఐటియు కార్యాలయంలో యూనియన్ నగర పశ్చిమ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. పర్సా సత్యనారాయణ చిత్రపటానికి సిఐటియు సీనియర్ నాయకులు ఆది నికల్సన్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నేతాజి మాట్లాడుతూ పర్సా సత్యనారాయణ చిన్నతనం నుండే సమాజంలో ఉన్న రుగ్మతలకు వ్యతిరేకంగా పని చేశారని అన్నారు. కొత్తగూడెం బొగ్గు గని కార్మికులను ఐక్యం చేశారని, విశాఖ ఉక్కు పరిశ్రమ నిర్మాణం కోసం తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారని తెలియజేశారు. రాష్ట్రంలో కార్మికుల సమస్యలపై కషి చేయడమే పర్సా సత్యనారాయణకు ఇచ్చే నివాళి అని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు నగర పశ్చిమ కమిటీ ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు, అధ్యక్షులు బి.సత్యనారాయణ, నాయకులు ఆది నికల్సన్, షేక్.ఖాశీంవలి, షేక్.మస్తాన్‌వలి, దొడ్డా కోటేశ్వరరావు, పూనేపల్లి శ్రీనివాసరావు, షేక్.బాషా, కుంభా శివయ్య, జి.శ్రీనివాసరావు, కె.మరియదాసు, పాల్గొన్నారు.

కమ్యూనిస్టు వీర్లంకయ్య ఆదర్శనీయులు

తుళ్లూరులో సంస్మరణ సభలో ఎం రవి

ప్రజాశక్తి-తుళ్లూరు

సిపిఎం ఆశయాలకు అనుగుణంగా నిరంతరం ప్రజల సమస్యలపై ముందు నడిచి కమ్యూనిస్టు వీర్లంకయ్యగా పేరొందిన జొన్నకూటి వీర్లంకయ్య ఆదర్శనీయులని సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి శ్లాఘించారు. వీర్లంకయ్య మూడవ వర్ధంతి కార్యక్రమం బుధవారం రాత్రి తుళ్లూరులోని ఆయన స్వగృహం వద్ద జరిగింది. వీర్లంకయ్య స్మారక స్తూపం, కమ్యూనిటీ హాలు వద్ద సిపిఎం జెండాల ఆవిష్కరణ అనంతరం పేరం బాబురావు అధ్యక్షతన సభ జరిగింది. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ రైల్వే ఉద్యోగిగా పనిచేస్తూ రైతు, కార్మిక తదితర సంఘాల బాధ్యుడిగా పనిచేస్తూ ప్రజల సమస్యలపై పోరాటం చేశారని చెప్పారు. రాజధాని నిర్మాణం కారణంగా వ్యవసాయ పనులు కోల్పోయిన కూలీలకు అమరావతి జీవన భృతి అసైన్డ్ రైతులు, భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై అమరావతి దళిత, రైతు, మైనారిటీ జెఎసి, సిఐటియుతో కలిసి పనిచేశారని తెలిపారు. అనారోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా ఉద్యమాలలో పాల్గొనే వాడని చెప్పారు. స్వార్ధం పెరిగిపోతున్న నేటి సమాజంలో ఎదుటివారి ప్రయోజనం కోసం పాటు పడేవారు అరుదని, అలాంటి అరుదైన వారిలో వీర్లంకయ్య ఒకరని చెప్పారు. వీర్లంకయ్య ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు నిజమైన నివాళి అని రవి తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎం భాగ్యరాజు, వి వేంకటేశ్వరరావు, కట్టెపోగు ప్రకాశరావు, బి సూరిబాబు, గడ్డం కృష్ణ, వీర్లంకయ్య భార్య కామాక్షి, కుమారుడు నవీన్ ప్రకాష్, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి

మైనార్టీ పాలిటెక్నిక్ కాలేజీలో విద్యార్థులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి-గుంటూరు

నల్లపాడులోని ప్రభుత్వ మైనార్టీ పాలిటెక్నిక్ కాలేజీలో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో బుధవారం జాబ్ అచ్చీవర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పి.రాజశేఖరరావు మాట్లాడుతూ ఆటో మొబైల్ ఇంజినీరింగ్ బ్రాంచిలో 12 మంది విద్యార్థులు జయలక్ష్మి ఆటోమోటివ్స్‌లో, అలాగే ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ బ్రాంచ్‌లో ముగ్గురు విద్యార్థులు సిండిక్ కన్సల్టింగ్ ఇంజినీర్స్‌లో ఉద్యోగాలకు ఎంపికయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా ఆ జరిగిన అభినందన సభలో ప్రిన్సిపాల్ రాజశేఖరరావు, జయలక్ష్మి ఆటోమోటివ్స్ వర్క్ మేనేజర్లు సాయినాథ్, అఫ్సర్, అధ్యాపకులు ఆయా విద్యార్థులను అభినందించారు.

ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ తదితరులు

సమస్యను పరిష్కరించకుంటే సమ్మెలోకి..

పెండింగ్ జీతాలను వెంటనే చెల్లించాలి : సిఐటియు

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ క్లాప్ కార్పొరేషన్ డ్రైవర్ల జనరల్‌బాడీ సమావేశం బుధవారం రాత్రి స్థానిక సిఐటియు కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీ స్ యూనియన్ మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎస్ ఎస్ చంగయ్య అధ్యక్షత వహించి మాట్లాడుతూ మున్సిపల్ క్లాప్ ఆటో డ్రైవర్లకు పెండింగ్‌లో ఉన్న జీతాలు వెంటనే జమ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వారికి వారాంతపు సెలవులు పండుగ సెలవులు క్యాజువల్ సీఎల్ సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే సమ్మె చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో,యూనియన్ పట్టణ అధ్యక్షులు పేరం పూర్ణచంద్రరావు,యూనియన్ నాయకులు క్లాప్ ఆటో డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న చంగయ్య

అంబేద్కర్ గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరణ

ప్రజాశక్తి-గుంటూరు

డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకులాలలో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలో 2024-25 సంవత్సరంలో 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్లలో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ విద్యాలయాల సంస్థ జిల్లా కోఆర్డినేటర్ కె.పద్మజ ఒక ప్రకటనలో తెలిపారు. నాల్గవ తరగతిలో ఉత్తీర్ణులై ఉండాలని, ఇంటర్‌లో ప్రవేశానికి 2023-24 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. అర్హత గల విద్యార్థులు ఐదవ తరగతిలో ప్రవేశానికి ఈనెల 24వ తేదీ ఉదయం 10 గంటలకు, ఇంటర్‌లో ప్రవేశానికి 25వ తేదీ ఉదయం 10 గంటలకు గుంటూరు జిల్లా, అడవితక్కెళ్లపాడులోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకులంలో నిర్వహించే కౌన్సెలింగ్‌కు ఆధార్ కార్డు, ఇతర విద్యార్హత సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు.

ఐటిఐలలో వంద శాతం సీట్లు భర్తీ చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు

ప్రభుత్వ, ప్రైవేటు పారిశ్రామిక శిక్షణా సంస్థలలో (ఐటిఐ) సమన్వయ శాఖల సహకారంతో వందశాతం సీట్లు భర్తీ చేయాలని జిల్లా ఉపాధి కల్పన అధికారి కె.రఘు అన్నారు. ఈ అంశంపై గుంటూరులోని జిల్లా ఉపాధి కార్యాలయంలో నిర్వహించిన జిల్లాస్థాయి ఒకేషనల్ గైడెన్స్ కమిటీకి బాపట్ల, పల్నాడు జిల్లాల అధికారులు, కమిటీ సభ్యులు హాజరయ్యారు. ఈసందర్భంగా రఘు మాట్లాడుతూ ఐటిఐ అడ్మిషన్ల నోటిఫికేషన్ విడుదలైందని, దరఖాస్తు చేసుకోవటానికి జూన్ 10 వరకూ అవకాశం ఉందని తెలిపారు. ఐటిఐ ఉత్తీర్ణులైన విద్యార్థులకు పరిశ్రమలలో ఉద్యోగాలు కల్పించే విధంగా స్వయం ఉపాధి పొందే విధంగా ముందస్తు కార్యాచరణ ప్రణాళిక ఎంతో అవసరం అన్నారు. ప్రతి ఒక్కరూ నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని ఆదేశించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో డిస్ట్రిక్ట్ ఇండస్ట్రియల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

సృజనాత్మకత పెంచుకోవాలి

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా పిల్లలకు బుధవారం కథలు, కథానికలు చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎన్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కథల ద్వారా పిల్లలు సృజనాత్మక శక్తిని, పుస్తక పఠనం పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

మంగళగిరిలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి-మంగళగిరి

మంగళగిరి పట్టణంలో ప్రధాన కూడలి ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ట్రాఫిక్ బోర్డులను పట్టణ సీఐ ఎం శ్రీనివాసరావు ఏర్పాటు చేయడం జరిగింది. నగరంలో ప్రధాన కూడలి ప్రాంతాలైన ఎయిమ్స్ ఆసుపత్రికి వెళ్లే రోడ్డు, పాత బస్టాండు , తెనాలి వెళ్లే రోడ్డు, కూరగాయలు అమ్మే వద్ద, ఆటోనగర్ ఆర్టీసీ గ్యారేజీ వెళ్లే రోడ్డు వద్ద ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ట్రాఫిక్ బోర్డులను సిఐ ఏర్పాటు చేయడం జరిగింది. ఎస్ ఆర్ ఎమ్ నుండి వచ్చే బస్సులు పాత బస్టాండ్ వద్ద కాకుండా నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద నుండి యుటర్నింగ్ తీసుకోవాలని సీఐ వారికి తెలియజేశారు. అదేవిధంగా మెయిన్ బజార్, మిద్దె సెంటర్ వద్ద కూడా ట్రాఫిక్ బోర్డులను ఏర్పాటు చేసి ఎలాంటి సమస్య లేకుండా తగిన చర్యలు తీసుకుంటున్నారు. నగర ప్రజలందరూ ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటిస్తూ పోలీసు వారు ఏర్పాటు చేసిన ట్రాఫిక్ బోర్డులను అనుసరించి వాటి ప్రకారం నడుచుకోవాలని, పట్టణ పోలీసుల వారికి ప్రజలు సహకరించాలని సిఐ ఎం శ్రీనివాసరావు కోరారు.

ఈవీఎంలు ధ్వంసం చేసిన వారిపై

పోటీ చేయకుండా అనర్హత వేటు వేయండి

జొన్నలగడ్డ విజయ్ కుమార్

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

ఈవీఎంలు ధ్వంసం చేసిన వారిపై ఎన్నికల్లో పోటీ చేయకుండా శాశ్వతంగా అనర్హత వేటు వేయాలని జైభీమ్ రావ్ భారత్ పార్టీ సత్తెనపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి, పల్నాడు జిల్లా అధ్యక్షుడు, జొన్నలగడ్డ విజయ్ కుమార్ డిమాండ్ చేశారు. సత్తెనపల్లి ఆ పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు పోలింగ్ రోజున బూతుల్లోకి వెళ్లి ఈవీఏం ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలతో పాటు భవిష్యత్తులో ఎన్నికల్లో పోటీ చేయకుండా అనర్హత వేటు వేయాలని డిమాండ్ చేశారు.. ఎన్నికలు సజావుగా జరుగుతున్నాయా లేదా తెలుసుకునేందుకు ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు పోలింగ్ బూత్‌లోకి వెళ్లే అధికారాన్ని రాజ్యాంగాన్ని అనుసరించి ఎన్నికల కమిషన్ కల్పించిందన్నారు. లోపలకెళ్లి ఓటింగ్ సరళి తదితర విషయాలు పరిశీలించాలే గాని ఈవీఎంలు పగలగొట్టడానికి కాదని అన్నారు. అభ్యర్థి వ్యవహార శైలి రాజ్యాంగానికి విరుద్ధంగా ఉంటే అతన్ని భవిష్యత్తులో ఎన్నికల్లో పాల్గొనకుండా బహిష్కరించేలా స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన ఎన్నికల కమిషన్ కు పూర్తి స్వేచ్ఛ ఉందన్నారు. మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఈవీఎంలు పగలగొడుతున్న వీడియోలు సామాజిక మాధ్యమాల్లో రెండ్రోజులుగా చక్కర్లు కొడుతున్నాయన్నారు. ప్రజాప్రతినిధి, మాజీ విప్ అయిన పిన్నెల్లి ఇటువంటి ఘటనలకు పాల్పడటం హేయమైన చర్యగా అభివర్ణించారు. భవిష్యత్తు ల్లో ఇటువంటి సంఘటనలు పునరావృతం చర్యలు తీసుకోవాలన్నారు.. అదేవిధంగా గుంతకల్లు టీడీపీ-జనసేన కూటమి అభ్యర్థి మధుసూదన్ గుప్తా కూడా ఈవీఎం పగలగొట్టినవీడియో చక్కర్లు గొడుతున్నాయని అన్నారు.

రెండవ రోజు నిరసనలో చదలవాడ అరవిందబాబు

కూటమి అభ్యర్థుల అరెస్టులపై కొనసాగుతున్న నిరసన

ప్రజాశక్తి - నరసరావుపేట

నరసరావుపేట నియోజకవర్గ టిడిపి-జనసేన-బిజెపి ఉమ్మడి అభ్యర్థి చదలవాడ అరవింద బాబు ఉమ్మడి కూటమి నాయకులు,కార్యకర్తలను అక్రమ అరెస్టులను ఖండిస్తూ నిరసన కార్యక్రమం రెండవ రోజుకు చేరుకుంది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ఎన్నికల రోజున జరిగిన హింసాత్మక సంఘటనలను ప్రేరేపించిన వైఎస్ఆర్సిపి పార్టీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, వారి అనుసురులపై ఎటువంటి చర్యలు చేపట్టకుండా కేవలం కక్షపూరితంగా తమ నాయకులను అక్రమ అరెస్టులు చేసి రిమాండ్ కు తరలిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈరోజు వరకు ఘర్షణకు పాల్పడిన వైసిపి నాయకులను, కార్యకర్తలను అరెస్టు చేయలేదని, ఎటువంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ఇప్పటికీ పోలీసులు, వైసిపి కార్యకర్తల వలె పనిచేస్తున్నారని విమర్శించారు. ఘర్షణకు పాల్పడిన వైసిపి నాయకులను , కార్యకర్తలను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.ఘర్షణకు పాల్పడిన ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిని. , పోలింగ్ బూత్ లోకి వెళ్లి ఈవీఎం బాక్సును పగలగొట్టిన పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని అరెస్టు చేయాలని కోరారు. వైసిపి నాయకులు, కార్యకర్తలు చేసిన విధ్వంసం చూస్తూ ఊరుకున్న పోలీసు వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ ని కోరారు. కార్యక్రమంలో టిడిపి లీగల్ సభ్యులు, టిడిపి,జనసేన నాయకులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు కార్డులు అందేదెప్పుడో?

- ఖరీఫ్‌కు సిద్ధమవుతున్న రైతులు
- నేటికీ ప్రారంభం కానీ కౌలు కార్డుల ప్రక్రియ
- పట్టణ, మండల పరిధిలో 80 శాతం మంది కౌలు రైతులు
- ఇప్పటికే కౌలు ఒప్పందాలు పూర్తి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

కొన్ని రోజుల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుంది. కౌలు రైతులకు ఇంత వరకూ కౌలు రైతు కార్డులు అందలేదు. కౌలు కార్డులు జారీకి సంబంధించిన ప్రక్రియ ప్రతి ఏడాది ఏప్రిల్ మూడో వారం నుంచే అధికారులు ప్రారంభించే వారు. గ్రామసభలు ఏర్పాటు చేసి కౌలు రైతులను గుర్తించే వారు. యజమానులకు అవగాహన కల్పించే ప్రక్రియ చేపట్టేవారు. అయితే, ఈ ఏడాది ఎన్నికలు కారణంగా కౌలుకార్డులకు సంబం ధించిన ప్రక్రియ ఇంకా ప్రారంభం కాలేదు. జూన్ రెండో వారం నుంచి ఖరీఫ్‌కు సిద్ధమయ్యే వారికి కౌలు కార్డులు అందే పరిస్థితి లేదని రైతులు చెబుతున్నారు.. రైతు భరోసా ఎప్పటికి వస్తుందో తెలియని పరి స్థితి అని కౌలు రైతులు అంటున్నారు. కౌలు కార్డుల జారీ ప్రక్రియ ప్రారంభించక పోవడంపై ప్రభుత్వంపై కౌలు రైతులు విమర్శలు చేస్తున్నారు. చిలకలూరిపేట పట్టణ, మండల పరిధిలో 80 శాతం మంది కౌలు రైతులు ఉన్నారు. వ్యవసాయ భూమి మొత్తం 13, 500 హెక్టార్లు ఉన్నట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. అయితే, పోయిన సంవత్సరం కౌలురైతు కార్డులు మొత్తం 2,300 ఇచ్చినట్లు స్థానిక రెవిన్యూ అధికారులు చెబుతున్నారు. దేవాదాయ భూములతో తమకు సంబంధం లేదని అంటున్నారు. కనీసం ఈ ఏడాది అయినా పూర్తి స్థాయిలో కౌలు రైతుల కార్డులు ఇవ్వాలని వారు కోరుతున్నారు.

ప్రస్తుతం వాతావరణం అనుకూలించి వేసవిలో తొలకరి వర్షాలు పడి పట్టణ, మండల స్థాయిలో రైతులు వేసవి దుక్కులు దున్నేందుకు సమాయత్త మౌతున్నారు. ఇప్పటికే కౌలు ఒప్పందాలు దాదాపు పూర్తయినట్లు తెలుస్తోంది. గత సంవత్సరం పంటలు ఆశా జనకంగా ఉండటం, వ్యవసాయ భూములు, వ్యవసాయేతర వాటికి (బై పాస్ రోడ్ల నిర్మాణం, చీరాల నుంచి రోడ్ల వెడల్పుకు మట్టి కోసం దగ్గర లోని భూములను అధిక రేట్లకు కొనుగోలు చేయడంతో) అమ్ముకోవడంతో ఇదే అదునుగా భూ యజమానులు కొద్దిగా కౌలు ధర పెంచారు. నీటి సౌకర్యం లేని తేలికపాటి (గరప నేలలు) నెలలు అయితే గతంలో రూ.20,000 నుంచి రూ.22,000 వేలు ఉండేది. ప్రస్తుతం రూ.30,000 పలుకుతోందని రైతులు అంటున్నారు. నీటి తడులున్న భూములైతే కౌలు ధర సుమారు రూ. 35, 000 వరకు పెంచారని చెబుతున్నారు.

కౌలు కార్డులు జారీ చేసి బ్యాంకుల రుణాలు అందిస్తే కౌలు రైతులకు కొంత మేలు జరుగుతుందని,లేకపోతే కౌలు చెల్లింపుల కోసమే ప్రైవేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోందని చెబుతున్నారు. గతంలో జారీ చేసిన కౌలు కార్డులను రెన్యువల్ చేయడంతోపాటు, కొత్త కార్డులు జారీ ప్రక్రియ చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని కోరు తున్నారు. రైతు భరోసా సక్రమంగా అమలు చేయాలని కోరుతున్నారు. అంతేకాకుండా, భూ యజమానితో సంబంధం లేకుండా వాస్తవ సాగుదారు లకు కౌలు కార్డులు జారీ చేయాలని కోరతున్నారు.

కౌలు కార్డు లేదు

కౌలు రైతు వీరాంజనేయ రాజు

కౌలు రైతు వీరాంజ నేయ రాజు మాట్లాడుతూ ప్రస్తుతం కౌలు ధర రూ. 30 వేలు నడు స్తోందని చెప్పారు. రోడుకు, ఇళ్లకు దగ్గరగా ఉంటుందని కూలీలకు, పంట ఇంటికి తీసుకెళ్ళేందుకు అనుకూలంగా ఉంటుందని ఆ ధర పెట్టాల్సి వచ్చిందని చెప్పారు. ప్రత్తి పంట వేద్దామనుకుంటున్నానని, తనకు కౌలు కార్డు లేదని చెప్పారు.

కౌంటింగ్ ఏజెంట్లతో ఆర్ఒ సమావేశం

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

కౌంటింగ్ ఎంజెట్లతో ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి మురళీ కృష్ణ బుధవారం సమావేశం నిర్వహించారు. ఓట్లు లెక్కింపు,కౌటింగ్ ఏర్పాట్లు గురించి తెలియజేశారు. నరసరావుపేట జేఎన్టీయూ లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్ వద్ద సిసి కెమెరాలను ఏర్పాటు చేశామని ఎన్నికల్లో పోటీచేసిన అభ్యర్థులు వారి ఏజెంట్ లు ప్రతినిధులు ఎవరైనా క 24 గంటలు, కౌంటింగ్ రోజు వరకు లైవ్ ఫుట్ ఏజ్ ను చూసుకోనుటకు అనుమతి ఇచ్చామని చెప్పారు.త.పోస్టల్ బ్యాలెట్ ,హెూమ్ ఓటింగ్ బాక్స్ లను కౌంటింగ్ కు ముందు రోజు జూన్ 3వతేదీన సాయంత్రం 4.00గంటలకు కౌంటింగ్ సెంటర్ కు

తరలిస్తామని వివరించారు, కౌంటింగ్ రోజు ఉదయం.7.59 గంటల వరకు వచ్చిన సర్వీస్ ఓట్లు , పోస్టల్ బ్యాలెట్లను మాత్రమే కౌంటింగ్ లో పరిగణన లోనికి తీసు కుంటామని చెప్పారు. ఈ సమావేశంలో సహాయ రిటర్నింగ్ అధికారులు. సిహెచ్ ఉష, ఎల్. లక్ష్మీ నారాయణ, పి. లక్ష్మీనరసింహం, కె.షమ్మి, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులతో గ్రంథాలయాధికారి హిమబిందు

7 వరకు వేసవి శిక్షణ శిబిరాలు

ప్రజాశక్తి- గురజాల : గ్రంథాలయాల్లో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణా శిబిరాలు వచ్చే నెల 7వ తేదీ వరకు కొనసాగుతాయని గురజాల గ్రంథాలయ అధికారి హిమబిందు పేర్కొన్నారు. విద్యార్థుల కోసం డ్రాయింగ్, వ్యాసరచన, క్విజ్, డిబేట్, హ్యాండ్ రైటింగ్, పేపర్ క్రాపింగ్‌లలో శిక్షణ ఇస్తున్నట్లు ఆమె తెలిపారు.

శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే శిక్ష తప్పదు

ఎస్‌పి మల్లికా గార్గ్ హెచ్చరిక

ప్రజాశక్తి-మాచర్ల

శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే ఎంతటి వారైనా శిక్ష తప్పించుకోలేరని పల్నాడు జిల్లా ఎస్‌పి మల్లికాగార్గ్ హెచ్చరించారు. మాచర్ల టౌన్‌లో పల్నాడు జిల్లా ఎస్‌పి మల్లికాగార్గ్ మంగళ వారం పర్యటించారు. ఆమె పట్టణ పోలీసు స్టేషన్, రూరల్ సర్కిల్ కార్యా లయంలో గురజాల సబ్ డివిజన్ డిఎస్‌పి, సిఐ తదితర అధికారులతో ఇటీవల జరిగిన హింసాత్మక సంఘట నలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో ఎన్నికలకు ముందర, ఎన్నికల రోజున, ఎన్నికల తరువాత జరిగిన పలు ఘర్షణలపై జిల్లా వ్యాప్తంగా 1,500 మందిపై 146 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. వీరిలో 958 మందిపై చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. మరో 2 రోజులలో మిగతా వారిని గుర్తించి ఆరెస్టు చేస్తామన్నారు. ఇందు కోసం ప్రత్యేక టీమ్స్ పని చేస్తున్నట్లు వివ రించారు. జిల్లా వ్యాప్తంగా వేల సంఖ్యలో వివాదస్పద వ్యక్తులను బైండవర్ చేసినట్లు తెలిపారు. వీరిలో 250 మంది తాజా ఘర్షణలలో పాల్గొన్నట్లు గుర్తించినట్లు వివరించారు. వీరికి నోటీసులు పంపనున్నట్లు తెలిపారు. వారి నేర చరిత్ర మేరకు వారిని బైండవర్ చేసిన ఎమౌంట్‌ను ప్రభుత్వ ట్రెజరీలో చెల్లిం చాల్సి ఉంటుందన్నారు. లేదంటే వారిని రెవిన్యూ అధికారుల ఆదేశాలతో ఆరెస్టు చేస్తామని హెచ్చరించారు. లూజ్ పెట్రోల్ సేల్స్ చేయవద్దని హెచ్చరించినా గురజాలలో ఒక బంక్‌కు చెందిన వారు లూజ్ పెట్రోల్ సేల్స్ చేసినట్లు గుర్తించినట్లు తెలిపారు. అతనికి నోటీసులు పంపినట్లు తెలిపారు. తాము డెకాయి ఆపరేషన్స్ నిర్వహించి లూజ్ సేల్స్ చేసే పెట్రోల్ బంక్‌లపై చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో పలువురు పోలీసు ఉన్నాతాధికారులు పాల్గొన్నారు. అనంతరం మాచర్ల పట్టణ పురవీధులలో పల్నాడు జిల్లా ఎస్‌పి మల్లికాగార్గ్ ఆధ్వర్యంలో పోలీసు కవాత్ నిర్వహించారు.

మాచర్లలో జిల్లా ఎస్‌పి మల్లికాగార్గ్ ఆధ్వర్యంలో పోలీసు కవాత్

కొనసాగుతున్న 144 సెక్షన్

ఎన్నికల రోజు, ఎన్నికల అనంతరం జరిగిన ఘర్షణల నేపథ్యంలో మాచర్ల పట్టణంలో ఈ నెల 15వ తేది నుండి 144 సెక్షన్ కోనసాగుతుంది. గత నాల్గు రోజులుగా వ్యాపార సంస్థలకు వ్యాపార లావాదేవిలు జరుపుకునేందుకు వెసులుబాటు కల్పించిన అధికారులు మంగళ వారం మధ్యాహ్నం నుండి వ్యాపార సంస్థలను మూసి వేయించారు. దీని వలన చిరు వ్యాపారులు తీవ్రంగా నష్ట పోతున్నారు.

సీతానగరంలో కార్డెన్‌సెర్చ్

ప్రజాశక్తి - తాడేపల్లి

పట్టణంలోని కృష్ణానది పరివాహక ప్రాంతమైన సీతానగరంలో సిఐ కళ్యాణ్‌రాజ్ ఆధ్వర్యంలో ఇద్దరు ఎస్ఐలు, 100 మంది పోలీసులతో బుధవారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ధ్రువపత్రాలు లేని 12 ద్విచక్ర వాహనాలు, 3 ఆటోలను సీజ్ చేశారు. సిఐ మాట్లాడుతూ తాడేపల్లిలో ఎన్నికలు ప్రశాంత నిర్వహణకు అందరూ సహకరించారని అభినందించారు. ఓట్ల లెక్కింపు సమయం, అనంతరమూ ఆవాంఛనీయ ఘటనలు జరగకుండా రాజకీయ పార్టీలు, ప్రజలు సహకరించాలని కోరారు. టపాసులు కాల్చొద్దని, వాటిని విక్రయించినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలను, కార్యకర్తలను కొంతమంది రాజకీయ నాయకులు రెచ్చగొట్టే అవకాశం ఉందని, ఎవరూ రెచ్చిపోవద్దని సూచించారు. విజయోత్సవ ర్యాలీలకూ అనుమతి లేదని స్పష్టం చేశారు. ఫలితాలు విడుదలయ్యే రోజైన 4వ తేదీన ఇళ్ల నుండి ఎవరూ బయటకు రావొద్దని, ఇంట్లో ఉంటూ టీవీల్లోనే ఫలితాలు చూసుకోవాలని సూచించారు. పట్టణంలో అనుమానిత వ్యక్తులు, కొత్తవారు ఎవరైనా వచ్చినా తమకు వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చినవారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు అందరూ సహకరించాలి

ప్రజాశక్తి - మేడికొండూరు

సార్వత్రిక ఎన్నికల ముగిసిన అనంతరం ఎన్నికల ఫలితాలు వెలువడే ఎన్నికల కౌంటింగ్ రోజు ప్రశాంత వాతావరణంలోకి ప్రజలంతా సహకరించాలని మేడికొండూరు సిఐ దార్ల జయకుమార్ అన్నారు. మేడికొండూరు పోలీస్ స్టేషన్ నందు బుధవారం మండలంలోని అన్ని గ్రామాల నాయకులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో భాగంగా సిఐ మాట్లాడుతూ మండలంలోని వివిధ పార్టీల నాయకులు,కార్యకర్తలు,ప్రజలు కౌంటింగ్ రోజు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడ కుండా సామరస్యంగా ఉండాలని సూచించారు. ప్రత్యేకంగా గ్రామాల్లో మనుషుల మధ్య రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయకూడదని అన్నారు. చట్ట వ్యతిరేకమైన చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటా మని అన్నారు. గ్రామాలలో ఏటువంటి ఘటనలుకు అవకాశం లేకుండా శాంతియుత వాతావరణం నెలకొల్పిలా ముందస్తు చర్యలు తీసుకున్నట్లు అన్నారు. ముఖ్యంగా మండలంలోని పలు సమస్యతక ప్రాంతాల్లో ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేసినట్లు ప్రజలంతా ఎటువంటి అవాంఛనీయ సంఘటనకు పాల్పడకుండా పోలీస్ వారికి సహకరించాలని కోరారు.

ఆయా గ్రామాల నాయకులతో మాట్లాడుతున్న సిఐ జయ కుమార్

ప్రజాశక్తి - తుళ్లూరు :జూన్ 4న ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ఎవరైనా అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డిఎస్పీ అశోక్ కుమార్ గౌడ్ హెచ్చరించారు. బుధవారం దొండపాడు గ్రామంలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల నాయకులతో డీఎస్పీ సమావేశమయ్యారు. వివాదాలకు పోయి జీవితాలు నాశనం చేసుకోవద్దు అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐలు సుభాని, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

శాంతి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ అశోక్ కుమార్

నివాళి అర్పిస్తున్న నాయకులు

భీమ్ భారత్ ఆధ్వర్యంలో భాగ్యరెడ్డివర్మకు నివాళి

ప్రజాశక్తి-గుంటూరు

అంటరానితనం, అణచివేతకు గురైన దళితుల తలరాతలు మార్చటానికి పోరాడిన తొలి ఉద్యమకారుడు భాగ్యరెడ్డివర్మ అని బీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షులు పాగళ్ల ప్రకాష్ తెలిపారు. బుధవారం అరండల్‌పేటలోని బీమ్ భారత్ కార్యాలయంలో భాగ్యరెడ్డివర్మ 136వ జయంతి కార్యక్రమం నిర్వహించారు. బీమ్ భారత్ జిల్లా కోఆర్డినేటర్ పసుమర్తి రమేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాగళ్ల ప్రకాష్ మాట్లాడుతూ అంటరాని కులాల వారే ఈ దేశ మూలవాసులని ఆది హిందువులని ఎలుగెత్తి నినదించిన ఉద్యమ నేత భాగ్యరెడ్డి వర్మ దళిత బాలికలకు పాఠశాలలను ఏర్పాటు చేశారన్నారు. దేవదాసి, బసవి, జోగిని వ్యవస్థ లాంటి దురాచారాలను రూపుమాపేందుకు ఉద్యమించాడన్నారు. అటువంటి మహనీయుల ఆశయాలను ఆలోచనలను కొనసాగిస్తూనే అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో నేషనల్ రీసెర్చ్ కలర్స్ పారా రమేష్, జిల్లా ఉపాధ్యక్షులు జి.వందనమ్మ, నూతక్కి వెంకటేశ్వర్లు కె.విల్సన్, వి.ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కృత్రిమ చేతుల పంపిణీ

ప్రజాశక్తి - మంగళగిరి :మంగళగిరి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మంగళకరము కార్యక్రమంలో భాగంగా పట్టణంలో గల వీటీజె ఎం డిగ్రీ కళాశాల ఆవరణలో జరుగుతున్న కృత్రిమ చేతుల పంపిణీ కార్యక్రమం బుధవారం కూడా కొనసాగింది. ఈ మూడు రోజుల్లో 71 మంది కి చేతులు అమర్చడం జరిగింది. ఎక్కువమంది విద్యుత్ షాక్ వలన చేతులు కోల్పోయిన వారు వస్తున్నారు. కార్యక్రమంలో ఈ హ్యాండ్ ప్రాజెక్ట్ వ్యవస్థాపకులు జర్మనీ దేశసదేశస్థులు క్రిస్ గల్లి, మంగళగిరి రోటరీ క్లబ్ అధ్యక్షులు అందే రేవంత్, చైర్మన్ ఏ అనిల్ చక్రవర్తి, గాజుల శ్రీనివాస రావు, ఆర్ శ్రీనివాస రావు, ఏ మురళి, పి రాజశేఖర్, సిహెచ్ గోపాల్, కే సుందరయ్య పాల్గొన్నారు.

హింసాత్మక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు

ప్రజాశక్తి -పొన్నూరు :ఓట్ల లెక్కింపును పురస్కరించుకుని ఫలితాలు వెలువడుతున్న నేపథ్యంలో అల్లర్లు, హింసాత్మక చర్యలకు పాల్పడితే చట్టరీత్య కఠిన చర్యలు తీసుకుంటామని అర్బన్ స్టేషన్ పి. భాస్కర్ హెచ్చరించారు. జూన్ 4వ తేదీన రాష్ట్రంలో వెలువడు ఎన్నికల ఫలితాల సందర్భంగా పొన్నూరు పట్టణంలో బుధవారం అర్బన్ పోలీసులు రూట్ మార్చ్ నిర్వహించారు . పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండి శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలిగించే సమాచారం ను అర్బన్ పోలీస్ స్టేషన్లకు తక్షణమే అందించి సహకరించాలని కోరారు. అలాంటి వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఎటువంటి అల్లర్లకు జరగకుండా ఉండేందుకు ముందస్తు చర్యగా పట్టణంలోని ఇటికంపాడు రోడ్ ప్రాంతాలలో పొన్నూరు అర్బన్ సిఐ భాస్కర్ ఆధ్వర్యంలో స్టేషన్ సిబ్బందితో రూట్ మార్చ్ నిర్వహించి అయా ప్రాంతంలో ప్రజలు అల్లర్లు కు పాల్పడకుండా అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ లు రాజకుమార్, షేక్ రెహిమాన్, ఏఎస్ఐ పీఎం సుభాని, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏనుగ కిషోర్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు

ప్రజాశక్తి - మంగళగిరి :వై ఎస్ ఎన్ చిట్స్ అధినేత ఏనుగ కిషోర్ పేద ప్రజలకు సాయం చేసే మంచి గుణమున్న వ్యక్తి అని కాపు, బలిజ సంక్షేమ సేన మంగళగిరి నియోజకవర్గ అధ్యక్షులు గుంటూరు జిల్లా కార్యదర్శి తిరుమల శెట్టి కొండలరావు అన్నారు. బుధవారం కిషోర్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయనకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కొండలరావు మాట్లాడుతూ ఆపదలో ఉన్నామంటూ కిషోర్ వద్దకు ఎవరు వెళ్ళినా సాయం అందించి అండగా నిలుస్తారని అన్నారు. ఆయన నిరు పేదల సంక్షేమం కోసం చేసిన సేవా కార్యక్రమాలే ఇందుకు నిదర్శనమన్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థినులు

రైతులకు అవగాహన సదస్సు

ప్రజాశక్తి - దుగ్గిరాల

రాబోయే ఖరీఫ్ సీజన్లో పంటలను రక్షించుకోవటానికి తీసుకోవాల్సిన చర్యలను బాపట్ల ఆచార ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థినులు రైతులకు అవగాహన కల్పించారు.. మండలంలోని ఈమని గ్రామంలో బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో విత్తన శుద్ధి చేసుకునే విధానం ఎలుకలు, కత్తెర పురుగు బారిన పడకుండా పంటలను రక్షించుకోవడానికి ప్రయోగించే విషపు ఎరా పంటకు కావలసిన పోషకాలను అందించటానికి పైరు పెరుగుదలకు భూసార పరిరక్షణ తదితర అంశాలను రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విద్యార్థినిలతో పాటు వ్యవసాయ శాఖ సిబ్బంది కూడా పాల్గొన్నారు.

1618వ రోజుకు రాజధాని దీక్షలు

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని అమరావతి నిర్మాణంతో రాష్ట్రం అభివద్ధి పథంలో నడుస్తుందని రైతులు అన్నారు.రాష్ట్ర ఏకైక రాజధానిగా అమరావతిని కొనసాగించాలని రైతులు,రైతు కూలీలు, మహిళలు చేస్తున్న దీక్షలు బుధవారంతో 1618వ రోజుకు చేరాయి.తుళ్లూరు, వెంకటపాలెం, అనంతవరం, వెలగపూడి,నెక్కల్లు తదితర గ్రామాల్లో దీక్షలు సాగాయి.ప్రజల ఆకాంక్షలను,కోర్టు తీర్పులను ఏమాత్రం పట్టించుకోకుండా రాజధానిని నిర్వీర్యం చేసి వైసిపి పాలకులు ఏం సాధించారని రైతులు ప్రశ్నించారు. రాజధాని లేకుండా చేసి రాష్ట్రాన్ని అప్రతిష్ట పాలు చేశారని మండిపడ్డారు.అమరావతి వెలుగు కార్యక్రమంలో భాగంగా కొవ్వొత్తులు వెలిగించి బిల్డ్ అమరావతి - సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ నినాదాలు చేశారు.

'పది'లో సత్తా చాటిన విద్యార్థులకు బిజెఆర్ కమిటి ప్రోత్సాహకాలు

ప్రజాశక్తి-తెనాలి : ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదివి, 500 మార్కులకు పైగా సాధించిన మాదిగ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించ నున్నట్లు బాబు జగజీవన్ రామ్ కమిటీ తెనాలి అధ్యక్షులు మేకల సురేష్ బుధవారం తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఆధార్ కార్డ్, మార్క్స్ మెమో జిరాక్స్ తో స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని అభిలాష స్టూడియోలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. తెనాలి, కొల్లిపర, దుగ్గిరాల, వేమూరు, కొల్లూరు, అమతలూరు, చుండూరు, చేబ్రోలు మండలాలకు చెందిన విద్యార్థులు ఈ అవకాశా న్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. వివరాలకు 8885 679393, 9010385576 నెంబర్లలో సంప్రదించాల్సిందిగా కోరారు

'కేన్స్' ఫిల్మ్ ఫెస్టివల్‌లో మన సినిమాకు రెడ్‌కార్పెట్

ప్రజాశక్తి-తెనాలిరూరల్ : ఫ్రాన్స్ దేశంలో జరుగుతున్న 'కేన్స్' ఫిల్మ్ ఫెస్టివల్ లో భారతీయ సినిమాకు రెడ్ కార్పెట్ స్వాగతం లభించడం యావత్తు భారతదేశం గర్వించదగ్గ విషయమని "మా-ఏపి" వ్యవస్థాపకులు, సిని దర్శకుడు దిలీప్ రాజా చెప్పారు. స్థానిక రత్న ఫార్చ్యున్ కల్యాణ మండపంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దిలీప్ రాజా మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన కేన్స్ అంతర్జాతీయ వేదికపై భారతదేశ చిత్రానికి లభించిన ఆదరణకు ఒక సిని దర్శకు డిగా ఆనందిస్తున్నానన్నారు. ముస్తాజాబుద్దీన్ మాలిక్ దర్శక త్వంలో రూపొందిన "గాడ్ మస్ట్ డై" చిత్రంలో సాక్షాత్తు దేవుడిని చంపడం ఊహించని కథాంశంగా రూపుదిద్దుకున్న భారతీయ సినిమాగా హాలీవుడ్‌లో నీరాజనాలు అందు కోవ డం ముదావహమన్నారు. ఈ చిత్రంలో భారతదేశ కథా నాయకుడిగా నటించిన సందీప్ కర్తార్ సింగ్ కు 'కేన్స్' లో రెడ్ కార్పెట్ వేయడం మరువలేని అనుభూతి అన్నారు. అమె రికా ఫిలిం మేకర్, నటి గ్రేటా గెర్విగ్ జ్యూరీ కు అధ్యక్షులుగా, ఫ్రెంచ్ నటి కెమిల్లి కోటిన్ హెూస్ట్ గా వ్యవహ రించిన కేన్స్ వేడుకల్లో శోభితా ధూళిపాళ్ల, కైరా అద్వానీ, ఐశ్వర్యరాయ్ బచన్, ఎమీ జాక్సన్, జాక్విలిన్ ఫెర్నాండెజ్, కన్నప్ప చిత్ర యూనిట్ తదితరులు పాల్గొనడం అక్కడి వేడుకలకు మరింత శోభ తెచ్చిందన్నారు. సిని దర్శకుడు అచ్చెన శ్రీనివాస యాదవ్ మాట్లాడుతూ గాడ్ మస్ట్ డై లాంటి ప్రయోగాత్మక చిత్రానికి భారత ప్రభుత్వం వినోదపు పన్ను మినహాయించి ఆయా దర్శక నిర్మాతలను ప్రోత్సహించాలని భారత ప్రభుత్వానికి మనవి చేశారు. కార్యక్రమంలో మా - ఏపి సంయుక్త కార్యదర్శి, మిలిటరి ప్రసాద్, ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్ మునిపల్లి శ్రీకాంత్, నటుడు బెల్లంకొండ వెంకట్, మన్నె సత్యనారాయణ చౌదరి, సహాయ దర్శకులు ఇంటూరి విజయ భాస్కర్, వెంకి రావణ్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న దిలీప్ రాజా

ఎన్నికల నేపథ్యంలో 57 కేసులు నమోదు

బైండవర్ చేసిన వారిలో 56 మంది కేసుల్లో ఉన్నట్లు గుర్తింపు : ఆర్‌ఓ, జెసి శ్యామ్‌ప్రాసాద్

ప్రజాశక్తి - మాచర్ల

మాచర్ల నియోజకవర్గంలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అనేక జాగ్రత్తలు తీసుకున్నట్లు ఆర్‌ఓ, జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ అన్నారు. ఆయన బుధవారం స్థానిక ఆర్‌ఓ కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాలలో అల్లర్లకు పాల్పడే వారు, గతంలో కేసులలో ఉన్న వారిని గుర్తించి వారందరిని ఎన్నికల సందర్భంగా ఎటువంటి సంఘటనలు జరగకుండా ఆవాంఛనీయ సంఘటనలలో పాల్గొనకుండా ముందుస్తు జాగ్రత్తలలో భాగంగా తహశీల్దార్స్ వద్ద 794 మందిని బైండవర్ చేసినట్లు తెలిపారు. వారిలో 56 మంది తిరిగి ఈ ఎన్నికల సందర్భంగా జరిగిన గోడవల్లో పాల్గొన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. వారు బైండవర్ చేసినప్పుడు ఎంత మొత్తం పూచికత్తు క్రింద నమోదు చేయటం జరిగిందో సదరు మొత్తాన్ని వెంటనే వారు ట్రెజరీకి చెల్లించాలని నోటీసులు జారి చేసినట్లు తెలిపారు. చెల్లించకపోతే వారు జైలుకు వెళ్ళవలసి ఉంటుందని హెచ్చరించారు. ఇదే తరహాలో కౌంటింగ్ జరిగే సందర్భంలో ఎటువంటి ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి నిఘా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎన్నికల కౌంటింగ్‌లో 14 టేబుల్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అభ్యర్థులు 15 మంది ఏజెంట్లను పెట్టుకోవచ్చునని తెలిపారు. కౌంటింగ్ హల్‌లోకి సెల్‌ఫోన్లు ఎట్టి పరిస్థితులలో అనుమతించమని తెలిపారు. ఆర్‌ఓలకు, అబ్జర్వర్‌కు మాత్రమే ఫోన్లు అనుమతి ఉంటుందన్నారు. కౌంటింగ్ ఏజెంట్లు ఎటువంటి ఎలక్ట్రానిక్ వస్తువులను తీసుకోచ్చినా వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభం ఆవుతుందన్నారు. పార్లమెంట్, అసెంబ్లీ సెగ్మంట్స్ వారిగా కౌంటింగ్ విడివిడిగా ఉంటుందన్నారు. ఉదయం 8 నుండి 8.30 వరకు పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ఉంటుందన్నారు. నియోజకవర్గంలో జరిగిన అల్లర్లలో ఎన్నికలకు ముందు 24 కేసులు, పోలింగ్ రోజున 29 కేసులు, పోలింగ్ అనంతరం 4 కేసులు మొత్తం 57 కేసులలో ఆయా ప్రాంతాలకు 405 మంది ఉన్నట్లు తెలిపారు. పోటి చేస్తున్న అభ్యర్థులు, వారి ప్రతినిధులతో ఆర్‌ఓ సమావేశమయ్యారు. వారికి కౌంటింగ్ హల్, కౌంటింగ్ ఏజెంట్లు గురించి, పోస్టల్ బ్యాలెట్ స్ట్రాంగ్ రూమ్, ఇవిఎంల స్ట్రాంగ్ రూమ్‌ల భద్రత గురించి వివరించారు. ఏజెంట్స్ సమక్షంలోనే పోస్టల్ బ్యాలెట్స్, ఇవిఎంలున్న స్ట్రాంగ్ రూమ్స్ తీసి లెక్కింపు ప్రక్రియ జరుగుతుందని ఆర్‌ఓ వివరించారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు : పల్నాడు ఎస్‌పి

ప్రజాశక్తి - రెంటచింతల

ఎన్నికల ఫలితాలు నేపథ్యంలో అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా శాంతిభద్రతలకు సహకరించాలని అల్లర్లకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అలాగే తామే వాహనాలను కాల్చుకొని ఇతర పార్టీ ల పై కేసులు పెట్టే వ్యక్తులను ఉపేక్షించేది లేదని పల్నాడు జిల్లా ఎస్పీ మల్లిక గార్గ్ తీవ్రస్థాయిలో హెచ్చరించారు. మంగళవారం రాత్రి పొద్దుపోయిన తర్వాత మండలంలోని ఈవీఎంల ధ్వంసమైన పాలువాయి గేట్ గ్రామంలోని 202 పోలింగ్ బూత్ తుమ్మురకోటలోనే 205,206, 207 పోలింగ్ బూతులను పరిశీలించి జరిగిన సంఘటనలు అడిగి తెలుసుకున్నారు రెంటాల గ్రామంలో జరిగిన దాడులు గురించి పూర్తి సమాచారాన్ని సేకరించారు కార్యక్రమంలో ఆమె వెంట ఆర్మీ డి డి.ఎస్.పి వెంకటేశ్వరరావు సిబ్బంది పాల్గొన్నారు.

డి.ఫార్మసీలో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక గుజ్జనగుండ్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కాలేజిలో రెండేళ్ల కాలపరిమితితో డి-ఫార్మసీ కోర్సులో ప్రవేశానికి సంబంధించి ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌కు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ప్రభాకరరావు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈనెల 21న దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైందని, జూన్ 15వ తేదీ దరఖాస్తుకు ఆఖరి తేదీ అని తెలిపారు.ఇంటర్ బైపిసిగానీ, ఎంపిసి, ఓపెన్ ఇంటర్‌లో ఎంపిసి, బైపిసి ఉత్తీర్ణులైన విద్యార్థినులు, సిబిఎస్ఈ, ఐసిఎస్ఈ బోర్డు నుండి తత్సమాన పరీక్షలలో ఉత్తీర్ణులైన వారు దరఖాస్తుకు అర్హులన్నారు. అదాయ ధృవీకరణ పత్రం కలిగిన, తెల్లరేషన్ కార్డు ఉన్న ఓసి, బిసి, ఎస్సీ, ఎస్టీ విద్యార్థినులకు అడ్మిషన్ ఫీజు మినహాయింపు ఉంటుందని, స్కాలర్‌షిప్ సౌకర్యం కూడా ఉందన్నారు. అడ్మిషన్ పొందిన విద్యార్థినులకు కళాశాల ప్రాంగణంలోనే హాస్టల్ వసతి ఉందని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థినులు అన్ని సర్టిఫికెట్లు, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో, అప్లికేషన్ రుసుము రూ.400లతో కళాశాల ఆఫీసులో సంప్రదించాలన్నారు. అదనపు వివరాల కోసం 9848038769, 9959324563, 9398620953 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఎన్‌సిసి శిక్షణలో పాల్గొన్న బాలికలు

వివిఐటిలో బాలికలకు ఎన్‌సిసి శిక్షణా శిబిరం

ప్రజాశక్తి - తెనాలి

వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వివిఐటి) కళాశాల నంబూరులో 10ఎ బాలికల బెటాలియన్ ఎన్‌సిసి గుంటూరు గ్రూప్ 7వ వార్షిక శిక్షణ శిబిరం బుధవారం ప్రారంభమైంది. బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కర్నల్ ఎస్.ఏ.ఎస్ సుదర్శన్ పర్యవేక్షణలో 10 రోజుల పాటు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో 10ఏ బెటాలియన్ గుంటూరు గ్రూప్ లోని వివిధ విద్యాసంస్థలకు చెందిన 632 బాలికలు ఈ వార్షిక శిక్షణ శిబిరంలో పాల్గొన్నారు. విద్యార్థులకు సైనిక సూత్రాలు, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, మైత్రి పెంపొందించే నైపుణ్యాల పెంపు లక్ష్యంగా ఈ శిబిరం ప్రారంభమైంది. ఎన్.సి.సిలో శిక్షణ పొందే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, శిక్షణలో నేర్చుకునే ప్రతి అంశము క్యాడెట్ల ఉన్నతికి తోడ్పడుతుందని కర్నల్ ఎస్.వి.ఎస్ సుదర్శన్ తెలిపారు. ఈ కార్యక్రమములో వివిఐటి ప్రిన్సిపల్ డాక్టర్ వై. మల్లిఖార్జునరెడ్డి, ఎన్.సి.సి. ఆఫీసర్ సయ్యద్ బీబన్ భాషా, డాక్టర్ ఎ. శ్రీవాణి, అధ్యాపకులు, గుంటూరు ఎన్.సి.సి బెటాలియన్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించిన కలెక్టర్

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు : ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో గుంటూరు పార్లమెంటు నియోజకవర్గం, ఏడు శాసనసభ నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్‌రూములను బుధవారం జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం.వేణుగోపాల్‌రెడ్డి, జిల్లా ఎస్పీ తుషార్ దూడి, సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి, గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరి, తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖార్ జైన్, అసిస్టెంట్ కలెక్టర్ (ట్రైనీ) స్వప్నిల్ జగన్నాథ్, గుంటూరు ఆర్డీఓ శ్రీకర్, ఇతర నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ముందుగా వర్సిటీలో డైక్‌మెన్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కంట్రోల్‌రూమ్ సందర్శించి అక్కడ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పరిశీలించారు. అనంతరం పాత్రికేయులకు మీడియా సెంటర్ కొరకు ఏర్పాటు చేసే హాల్‌ను పరిశీలించి తగు సూచనలు జారీ చేశారు. తదుపరి ఏఎన్‌యులో జూన్ 4వ తేదీన జరిగే ఓట్ల లెక్కింపు ప్రక్రియకు హాజరయ్యే ప్రభుత్వ సిబ్బందికి , రాజకీయ పార్టీల ఏజెంట్లు, అభ్యర్థుల వాహనాల పార్కింగ్ స్థలం కొరకు యూనివర్సిటీలో స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు పార్లమెంటు నియోజకవర్గం ఏఆర్‌ఓ భీమారావు, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ రాజలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపుకార్డు ఉంటేనే అనుమతి : కమిషనర్

మాట్లాడుతున్న కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు : సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు విధివిధానాలను కౌంటింగ్ సిబ్బందితో పాటు అధికారులు కూడా సమగ్రంగా అధ్యయనం చేయాలని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కీర్తి చేకూరి ఆదేశించారు. బుధవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో జూన్ 4 న జరిగనున్న ఓట్ల లెక్కింపు ఏర్పాట్లపై అధికారులతో సమీక్షా సమావేశం జరిగింది.ఈ సందర్భంగా కమిషనర్ అండ్ ఆర్‌ఓ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు విధులు కేటాయించబడిన అధికారులు ఓట్ల లెక్కింపు ప్రక్రియను సమగ్రంగా అధ్యయనం చేయాలన్నారు. ఓట్ల లెక్కింపులో తొలుతగా పోస్టల్ బ్యాలెట్స్, సర్వీస్ ఓట్లు లెక్కించడం జరుగుతుందని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్లలో వ్యాలిడ్, ఇన్‌వ్యాలిడ్ ఓట్లను ఎలా వేరు చేయాలో ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు సంబంధించిన సూచనలను ఆర్‌ఓలు, ఏఆర్‌ఓలు తప్పనిసరిగా చదివి అర్థం చేసుకోవాలన్నారు. కౌంటింగ్ విధులు కేటాయించబడిన వారు తప్పనిసరిగా ఐడి కార్డులు ధరించాలని, కౌంటింగ్ కేంద్రంలోనికి సెల్‌ఫోన్ అనుమతి లేనందున సెల్‌ఫోన్ డిపాజిట్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని డిఈఈని ఆదేశించారు. అలాగే కౌంటింగ్ కేంద్రంలో తగిన టేబుల్స్, ఇంటర్నెట్ కనెక్షన్, కంప్యూటర్లు, ఆపరేటర్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఈఈనిని, విధుల్లో ఉండే అధికారులు, సిబ్బందికి అల్పాహారం, భోజన సదుపాయాలు కల్పించాలని డిఈఈని ఆదేశించారు. స్ట్రాంగ్‌రూమ్ నుండి ఈవిఎంలు తీసుకొచ్చేందుకు, అధికారులు, లెక్కింపు సిబ్బంది, అభ్యర్థులు, ఏజంట్లు లెక్కింపు కేంద్రంలోకి వచ్చేందుకు వేర్వేరు మార్గాలు ఉండాలన్నారు. అవసరమైతే బారికేడింగ్ చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కౌంటింగ్ కు అవసరమైన మెటీరియల్‌ను చెక్ లిస్ట్ మేరకు సిద్ధం చేయాలని మేనేజర్‌ని ఆదేశించారు.సమావేశంలో ఏఆర్‌ఓలు సునీల్‌కుమార్, భీమరాజు, ప్రదీప్‌కుమార్, వెంకటలక్ష్మీ, డిప్యూటీ కమిషనర్ వెంకట కష్ణయ్య, ఈఈలు సుందర్రామిరెడ్డి, శ్రీనివాస్, డిఈఈ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎండల్లో హాయ్.. హాయ్.. నది నీటిలో ఎంజాయ్..

ప్రజాశక్తి - తాడేపల్లి

ఎండలు మండి పోతుండడంతో తీవ్ర ప్రభావం చూపుతుండడంతో కృష్ణానదిలో తమ పిల్లలు తీసుకుని వచ్చిన పెద్దలు సైతం నీటిలో సేదదీరారు. బుధవారం కృష్ణానది కరకట్ట వెంబడి కొండవీటి వాగు ఎత్తిపోతల పథకం సమీపంలో పిల్లలు, పెద్దలు ఉత్సాహంగా ఈతలేస్తూ ఆనందంగా గడిపారు. వేసవి సెలవులు కావడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను తీసుకొచ్చి ఈతలు నేర్పారు.

ఐపిఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు

స్టామినా పార్టనర్‌గా తెనాలి డబుల్ హార్స్

- ప్రపంచ స్థాయిలో వ్యాపార విస్తరణకు సన్నాహాలు
- దుబాయ్ ఫుడ్ పెస్టివల్‌లో ప్రపంచ దేశాలను ఆకర్షించిన డబుల్‌హార్స్ ఉత్పత్తులు

ప్రజాశక్తి-తెనాలి

ప్రముఖ వ్యాపార దిగ్గజం 'తెనాలి డబుల్ హార్స్' వ్యాపార విస్తరణకు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. దీనిలో భాగంగానే ఐపిఎల్ 2024 సీజన్‌లో అప్రతిహత విజయాలను నమోదు చేసుకుంటున్న సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు స్టామినా పార్టనర్‌గా వ్యవహరిస్తోంది. వ్యాపార ప్రాచుర్యానికి ఐపిఎల్ 2024 సీజన్‌ను వేదికగా చేసుకున్న తెనాలి డబుల్ హార్స్, త్వరలో తమ ఉత్పత్తులకు దేశవ్యాప్తంగా ఫ్రాంచైజ్‌లు ఏర్పాటు చేసే దిశగా అడుగులు వేస్తోంది. వ్యాపార రంగంలో అగ్రగామిగా ఖ్యాతి పొందిన తమ సంస్థ, ఇప్పుడు ప్రపంచ దేశాలను ఆకర్షించే స్థాయికి చేరిందని ఆ సంస్థ అధినేత మునగాల మోహన శ్యామ్ ప్రసాద్ చెబుతున్నారు. ప్రజాశక్తికి ఆయన వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి.

ఐపిఎల్‌లో సన్‌రైజర్స్‌తో డబుల్ హార్స్ ఉత్పత్తుల ప్రదర్శన

తెనాలి డబుల్ హార్స్ ఇరు తెలుగు రాష్ట్రాలతో పాటు ఖండాంతర ప్రశంశలందుకుంటున్న సంగతి తెలసిందే. ఆ సంస్థ ఆహార ఉత్పత్తులను ప్రపంచ దేశాలకు పరిచయం చేస్తుంది. ఇటీవలే దుబాయ్‌లో 199 దేశాలు పాల్గొన్న ఫుడ్ ఫెస్టివల్‌లో డబుల్ హార్స్ ఉత్పత్తులను ప్రత్యేకంగా ప్రదర్శించారు. ఈ ప్రదర్శన వివిద దేశాల ఆహార ప్రియులను విశేషంగా ఆకట్టుకుంది. తెలుగు వారి రుచులను ప్రపంచానికి పరిచయం చేసి పలు దేశాల ప్రశంసలనూ తెనాలి డబుల్ హార్స్ సొంతం చేసుకుంది. ఇప్పుడు తాజాగా ఐపిఎల్ 2024 వేదికగా తమ ఆహార ఉత్పత్తులను క్రికెట్ అభిమానులతో పాటు ప్రపంచ వ్యాప్తంగా పరిచయం చేస్తున్నారు. సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు స్టామినా పార్టనర్‌గా వ్యవహరిస్తున్న తెనాలి డబుల్ హార్స్ ఐపిఎల్ వేదికగా ప్రచారాన్ని కొనసాగిస్తుంది. తెనాలి ఖ్యాతిని ప్రపంచానికి చాటడమే కాకుండా వ్యాపార విస్తరణతో ఈ ప్రాంతానికే గర్వకారణంగా తెనాలి డబుల్ హార్స్ నిలుస్తుందనటంలో ఏమాత్రం సందేహం లేదు. ఐపిఎల్ సీజన్ ద్వారా డబుల్ హార్స్ వ్యాపార ఉత్పత్తులకు గణనీయమైన ప్రచారాన్ని పొందుతుంది. త్వరలోనే దేశవ్యాప్తంగా డబుల్‌హార్స్ ఉత్పత్తుల ఫ్రాంచైజ్‌లను ఏర్పాటు చేయాలన్న సంకల్పంతో ఉంది. సన్‌రైజర్స్‌కు స్టామినా పార్టనర్‌గా ఉన్న తెనాలి డబుల్ హార్స్ ప్రచారం కూడా పతాకస్థాయికి చేరుతుందని, ఫలితంగా గణనీయమైన వ్యాపార విస్తరణ జరుగుతోందిని సంస్థ అధినేత మునగాల మోహన శ్యామ్ తెలిపారు.